ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 40.0 కనిష్ఠం : 27.0
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 20 ఏప్రిల్ 2025

కలర్ ఫోటో..!


టమోటాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

కూలీల ముఖాలేమిటీ.. ఇలా వెలిగిపోతున్నాయి..?! అనుకుంటున్నారా..? కాస్త పరిశీలనగా చూడండి. వారి మధ్య రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కనిపిస్తారు..! అందుకే వారు అంతలా సంతోషంగా కనిపిస్తున్నారు. రామగిరి మండలం వెంకటాపురం సమీపంలోని తమ వ్యవసాయ క్షేత్రాన్ని ఎమ్మెల్యే శనివారం సందర్శించారు. వరి, టమోటా, అల్లనేరేడు పంటలను పరిశీలించారు. పనికి వచ్చిన కూలీల యోగక్షేమాలు తెలుసుకున్నారు. 'ఏ ఊరు..? సమస్యలేమైనా ఉన్నాయా..? ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..?' అని కూలీలను ఆరా తీశారు. అనంతరం పొలంగట్టు మీద రాళ్లపై కూర్చుని వారితో కలిసి ఫొటో దిగారు.

- ఆంధ్రజ్యోతి, రామగిరి



ఖరీఫ్ విత్తన సేకరణకు సన్నాహాలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ విత్తన సేకరణపై వ్యవసాయ అధికారులు సన్నాహక కార్యక్రమాలు చేపట్టారు. వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఏడీఏ రమణమూర్తి, ఏఓ సుకుమార్ రెండు రోజులుగా జిల్లాలోని ప్రాసెసింగ్ యూనిట్లను సందర్శించారు. నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను మాత్రమే సేకరించి, నిబంధనల మేరకు ప్రాసెసింగ్ చేయాలని ఆదేశించారు. మరో మూడు రోజుల్లో రాష్ట్రస్థాయిలో విత్తన సేకరణకు టెండర్లు నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈసారి ముందస్తుగానే విత్తన సేకరణను ప్రారంభించి, ఖరీఫ్ ఆరంభంలోనే సబ్సిడీతో రైతులకు వేరుశనగ, ఇతర పంటల విత్తనాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

'బఫర్ పరేషన్'పై కలెక్టర్ ఆగ్రహం

- నేటి వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ
- డీలర్లు స్టాకు లేదంటే ఫిర్యాదు చేయండి : డీఎస్ఓ



అనంతపురం టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ బియ్యం సరఫరా అస్తవ్యస్తంగా తయారు కావడంపై కలెక్టర్ వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బఫర్ పరేషన్..!' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం ప్రచురితమయింది. శుక్రవారం సెలవుకావడంతో పాటు జిల్లాకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్ వద్ద జిల్లా అధికారులతీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం బియ్యం కోత వ్యవహారంపై డీఎస్ఓను పిలిపించుకొని కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఇన్‌చార్జ్ డీఎస్ఓ వెంకటేశ్వర్లు బియ్యం సరఫరా, పంపిణీపై శనివారం వివరణ ఇస్తూ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో నెలకు 1,11,495 టన్నుల బియ్యం అవసరం ఉన్న విషయం వాస్తవమే అన్నారు. ఈ నెల కోటా కింద 72,392.74 టన్నుల బియ్యంతో పాటు అదనంగా 9,523 టన్నుల బియ్యం మంజూరు చేశామని అన్నారు. డీలర్ల వద్ద ఉన్న మిగులు నిల్వలు 26,766 టన్నులతో కలిపి 1,08,682 టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయని అన్నారు. జిల్లాలో సగటున 90 శాతం మంది ప్రతినెలా బియ్యం తీసుకుంటున్నారని, ఈ ప్రకారం ఈనెల సరఫరాకు సరిపడా బియ్యం ఉన్నాయని అన్నారు. ఇప్పటి వరకు 88.52 శాతం మంది లబ్ధిదారులు బియ్యం తీసుకున్నారని, మిగిలిన వారికి ఆదివారం వరకు పంపిణీ చేస్తామని తెలిపారు. ఏ డీలరైనా స్టాకులేదని బియ్యం ఇవ్వకపోతే వెంటనే తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని డీఎస్ఓ తెలిపారు. అలాంటి డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బఫర్ సమస్య తీర్చేందుకు ఇక పూర్తి కోటా

బఫర్ సమస్యను తొలగించడం కోసం ప్రభుత్వం నడుంబిగించింది. మూడునెలల పంపిణీని సరాసరిగా పరిగణలోకి తీసుకుని బియ్యం మంజూరు చేస్తోంది. వైసీపీ హయాంలో మిగులు బియ్యం మొత్తం బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతో రికార్డులలో మాత్రమే మిగులు కనిపిస్తుంటుంది. ప్రత్యక్షంగా డీలర్ల వద్ద ఆ బియ్యం ఉండడంలేదు. దీంతోనే ప్రస్తుత డీలర్లు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో బియ్యం సరఫరా చేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మే నెలలో కార్డుదారులు ఎంతమంది ఉంటే ఆ మేరకు పూర్తిస్థాయిలో బియ్యం సరఫరా చేయడానికి నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇప్పటికే పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ నుంచి డీఎస్ఓ కార్యాలయినికి సమాచారం వచ్చినట్లు తెలిసింది.

వృద్ధురాలికి ఊపిరి

అనంతపురం టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అనుకోవాలేగానీ.. అనంత పెద్దాస్పత్రిలో డాక్టర్లు చేయలేని వైద్యం లేదు.. ఆపరేషన్లు లేవు అంటే అతిశయోక్తి కాదు..! 72 ఏళ్ల వృద్ధురాలికి అరుదైన ఆపరేషన్ చేసి ప్రాణాలు నిలపడం దీనికి నిదర్శనం. గుత్తి పట్టణానికి చెందిన మాబున్నీకి గొంతు కింత పెద్ద గడ్డ ఏర్పడింది. ఆరేళ్లుగా వైద్యం చేయించుకున్నా పరిష్కారం కాలేదు. దీంతో ఆమె తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గడ్డ పరిమాణం నానాటికీ పెరుగుతుండటం, భరించలేని బాధ కలుగుతుండటంతో ఈ నెల 12న జిల్లా ఆస్పత్రికి వచ్చారు. పరీక్షించిన వైద్యులు.. థైరాయిడ్ గడ్డ అని నిర్ధారించారు. థైరోడక్టమీ సర్జరీ చేయాల్సి ఉంటుందని గుర్తించారు. అయితే గడ్డ పరిమాణం భారీగా ఉండటం, ఆమె వయసు ఎక్కువగా ఉండటంతో పూర్తి మత్తుతో ప్రాణాపాయం ఉంటుందని ఆలోచనలో పడ్డారు. ఆమె మెలకువలో ఉండగానే, అధునాతన పద్ధతిలో సర్వైకల్ ఎపిడ్యూరల్ ఇచ్చి ప్రాణాప్రాయం కలగకుండా సర్జరీ చేయాలని నిర్ణయించారు. ఈ నెల 15న సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ రామస్వామినాయక్ ఆధ్వర్యంలో డాక్టర్లు ఉజ్జనేశ్వరి, శ్రీహర్ష, ఎర్రిస్వామి, అనిల్, అనస్థీషియా వైద్యులు నవీన్ కుమార్, అరుణ లత, ఆదిలక్ష్మి సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. మాబున్నీ సమస్య పరిష్కారమైంది. ఆమె పూర్తిగా కోలుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున రెడ్డి, ఆర్ఎంఓలు వైద్య బృందాన్ని అభినందించారు.

- అరుదైన సర్జరీ చేసిన జిల్లా ఆస్పత్రి వైద్యులు


కోలుకున్న మాబున్నీతో సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి, వైద్య బృందం

బాధ్యతలు చేపట్టిన జిల్లా న్యాయాధికారి భీమారావు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయాధికారిగా భీమారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఆయనను పలువురు న్యాయాధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడ పనిచేస్తున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ బదిలీ అయిన విషయం తెలిసిందే.


జిల్లా న్యాయాధికారికి స్వాగతం

పాప సంహారం కోసమే యేసు పునరుత్థానం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


క్రైస్తవుల ర్యాలీ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సమాజంలోని పాపాలను పరిహరించి, మానవులను పునీతులను చేసేందుకే యేసుక్రీస్తు పునరుత్థానం చెందారని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అన్నారు. జిల్లాలోని పాస్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అరవిందనగర్‌లోని సీఎస్ఐ హోలీ ట్రినిటీ చర్చి నుంచి నగరంలో రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం క్రైస్తవ మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఇందులో భాగంగానే పాస్టర్లకు గౌరవ వేతనం అందిస్తూ గుడ్‌ఫ్రైడే రోజున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గుడ్ న్యూస్ చెప్పారన్నారు. అనంతరం సీఎస్ఐ చర్చి నుంచి ప్రారంభమైన రన్ ఫర్ జీసస్ యాత్ర కోర్టురోడ్డు, క్లాక్‌టవర్, సప్తగిరి సర్కిల్, ఎస్ఐయూ టౌన్ కాంగ్రిగేషనల్ చర్చి మీదుగా సీఎస్ఐ చర్చివరకు సాగింది. కార్యక్రమంలో టీడీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్, బ్రదర్ వరప్రసాద్‌రెడ్డి, రెవరెండ్ మోసెస్ అనిల్ కుమార్, బెన్హర్‌బాబు, జాన్‌వెస్లీ, సంపత్ విజయ్‌కుమార్, యేసయా, నెహెమ్యా, ఆనంద్, మనషే, సోల్‌మోను, కొటారి డేనియల్, కమల్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండల పరిధిలో ఓ కౌలు రైతు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పూలకుంటకు చెందిన డొక్కా రామకృష్ణ(58) చిన్నకుంటలో రెండు ఎకరాలు, పూలకుంటకు రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో పెట్టుబడులు, కుటుంబ పోషణ కోసం రూ.8 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడం, ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఉదయం భార్య కూలి పనికి వెళ్లగానే ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటుకలపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు డీఎస్సీ నోటిఫికేషన్.. ఖాళీలు 911

అనంతపురం విద్య, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీనికి అనుగుణంగా ఆదివారం ఉదయం నోటిఫికేషన్ జారీ అవుతుంది. ఉమ్మడి జిల్లాలో పాఠశాల విద్యాశాఖ పరిధిలో 807, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ్ పరిధిలో నాలుగు ఖాళీలు ఉన్నాయి. మొత్తంగా 811 పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. పోస్టుల వారిగా స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్-1లో 37 ఖాళీలు, హిందీ 28, ఇంగ్లిష్ 103, గణితం 43, ఫిజికల్ సైన్స్ 66, జీవశాస్త్రం 72, సోషల్ 111, ఫిజికల్ ఎడ్యుకేషన్ 145, ఎస్జీటీలు 202 ఖాళీలు ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ్ పరిధిలో ఫిజికల్ సైన్స్-1 జీవశాస్త్రం -1 ఎస్జీటీలు-2 ఖాళీలు ఉన్నాయి.

ఈ-వేస్ట్‌పై అవగాహన అవసరం : కలెక్టర్

నగరంలో ర్యాలీ..
ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్ ప్రారంభం


ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఈ-వేస్ట్ సేకరణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ముందువరుసలో నిలిచేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి నగర పాలక సంస్థ కార్యాలయం దాకా శనివారం ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇటీవల ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం బాగా పెరిగిందని, చెడిపోయినవాటిని సేకరించి, వాటిలో విలువైన పరికరాలను మళ్లీ ఉపయోగించేలా చేసేందుకే ఈ-వేస్ట్ సేకరణకు శ్రీకారం చుట్టామని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్న అవగాహన ఈ కార్యక్రమంతో పెరుగుతుందని ఎంపీ అంబికా అన్నారు. 75 ఏళ్ల వయసులో సీఎం చంద్రబాబు 25 ఏళ్ల యువకుడిలా ఆలోచిస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. ఈ-వేస్ట్ సేకరించాలన్న ఆలోచన గతంలో ఎవరికీ రాలేదని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్, కమిషనర్ బాలస్వామి, మేయర్ వసీం తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌తోనే విద్యారంగంలో సంస్కరణలు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న పలు సంఘాల ఉపాధ్యాయులు

అనంతపురం విద్య, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తోనే విద్యారంగంలో సంస్కరణలు సాధ్యమని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. పార్టీ అనంతపురం అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యేని ఉపాధ్యాయ సంఘాల నాయకులు శనివారం సత్కరించారు. నగరంలోని పలు ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం, 25 ఏళ్లుగా పోస్టులు మంజూరుకాని పాఠశాలలకు టీచర్ పోస్టులు వచ్చేలా ఎమ్మెల్యే కృషి చేయడంతో మున్సిపల్ టీచర్లు, టీఎన్‌యూఎస్ నాయకులు ఆయనను కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేకావడం, కూటమి అధికారంలోకి రావడం వెనుక టీచర్ల పాత్ర కీలకమైనదని అన్నారు. టీచర్లు తనపై చూపే అభిమానాన్ని ఎన్నటికీ మరిచిపోలేనని అన్నారు. తరచూ పాఠశాలలకు వచ్చి సమస్యలను తెలుసుకుంటానని అన్నారు. ఏడు పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయాలని టీచర్లు కోరారని, తాను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఆయన వెంటనే స్పందించి ఐదు స్కూళ్లు అప్‌గ్రేడ్ చేశారని, మిగిలిన రెండు స్కూళ్లలో వసతుల కల్పన తర్వాత అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యారంగంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారని అన్నారు. గత ప్రభుత్వంలో టీచర్లు ఎన్నో ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం వచ్చాకే టీచర్లకు గౌరవం లభిస్తోందని అన్నారు. ఏ సమస్య తన దృష్టికి తెచ్చినా.. మంత్రి లోకేశ్, ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, టీఎన్‌యూఎస్ జిల్లా అధ్యక్షుడు జయపాల్, రాష్ట్ర సహాధ్యక్షులు రామలింగప్ప, ఉపాధ్యక్షుడు ప్రకాష్, ఇతర సంఘాల నేతలు ఈశ్వరయ్య, రమణ, ఫణిభూషణ్, జనార్ధన్, నాగభూషణం, ఓబులేసు, పెద్దన్న, నారాయణ నాయక్, జయరాంనాయుడు, శ్యామ్‌కుమార్, భాగ్యరాగ్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికో రేటు..!

- సామాజిక తనిఖీల్లో అధికారుల చేతివాటం
- ప్రతి సోషల్ ఆడిట్‌కు రూ.30 వేలకుపైగా వసూలు
- నిధుల దుర్వినియోగ శాతం ఆధారంగా మరింత
- కీలకంగా వ్యవహరిస్తున్న ఇద్దరు అధికారులు
- డ్వామా విజిలెన్స్ విభాగంలో అక్రమాల తతంగం



ఖాళీగా దర్శనమిస్తున్న విజిలెన్స్ విభాగం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): డ్వామాలో వసూలు చేసుకున్న వారికి వసూలు చేసుకున్నంతా అన్నట్లుగా ఉంది పరిస్థితి. అధికారులపై అవినీతి ఆరోపణలు వస్తే వాటిని పట్టించుకోకుండా మరింత మంచి పోస్టింగ్‌తో పొరుగు జిల్లాలకు పంపుతున్నారు. ఇందుకు ఉదాహరణ గతంలో విజిలెన్స్ విభాగంలో పనిచేసిన కీలక అధికారిపై అనేక అవినీతి, అక్రమాల ఆరోపణలు వచ్చాయి. అయితే ఆయనకు మరింత మంచి పోస్టింగ్ ఇచ్చి పొరుగు జిల్లాకు బదిలీపై పంపారు. ఆయన తరువాత ఇన్‌చార్జ్‌గా ఓ అధికారికి బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన్ను ఉత్సవ విగ్రహం చేసి డ్వామా పీడీ తరువాత స్థాయి అధికారి, హెచ్‌ఆర్ విభాగంలో ఉండే అధికారి అనధికారికంగా పర్యవేక్షిస్తున్నారు. ఉపాధి పనులు, వాటర్ షెడ్ ఇతర డ్వామా పరిధిలో అమలు చేస్తున్న పథకాలలో జరిగిన అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై నిర్వహించే సామాజిక తనిఖీలు ఈ ఇద్దరు అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఎక్కడ సామాజిక తనిఖీ నిర్వహించినా రూ.30 వేల నుంచి రూ. 50వేలు వారికి ఆయా మండల అధికారులు కట్టాల్సిందే. లేదంటే సామాజిక తనిఖీలో తేల్చిన నిధుల దుర్వినియోగం, అక్రమాలపై ఒత్తిడి తీసుకువచ్చి చర్యలకు ఉపక్రమిస్తారు. దీంతో ఆయా మండల ఉపాధి అధికారులు, అక్కడ పని చేసే సిబ్బంది అందరూ తలో చేయి వేసి సామాజిక తనిఖీ వేదికకు టోకెన్ చెల్లించేస్తారు. ఇక అక్కడితో ఆగరు. దుర్వినియోగమైన నిధుల శాతం ఆధారంగా మరో దఫా పైకం ఇచ్చుకోవాల్సిందే. డ్వామాలో నిఘా, హెచ్‌ఆర్ విభాగాలకు చెందిన ఈ ఇద్దరు కీలక అధికారులే అవినీతి, అక్రమాలు ప్రోత్సహిస్తూ అక్రమ వసూళ్లను వాటాలుగా పంచుకుంటున్నారనే విమర్శలు ఆశాఖలో గట్టిగా విని పి స్తు న్నా యి. తాజాగా బుక్క రాయసముద్రం, రాప్తాడు, యల్లనూరు మండలాల్లో జరిగిన సామాజిక తనిఖీల్లో డ్వామాలోని ఇద్దరు కీలక అధికారులకు రూ. లక్షలు ముట్టజెప్పినట్లు సోషల్ మీడియలో వైరల్ అయ్యింది. ఆయా క్లస్టర్ల ఏపీడీలు, ఆయా మండలాల ఏపీఓలు, ఈసీ, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి వసూళ్లకు దిగినట్లు సమాచారం.

ఇద్దరిదే కీలక పాత్ర

ఉపాధి హామీ, వాటర్‌షెడ్ పథకాలలో నిధుల దుర్వినియోగానికి సంబంధించి రికవరీ చేయడానికి డ్వామాలో ప్రత్యేకంగా నిఘా, హెచ్‌ఆర్ విభాగాలు ఉన్నాయి. గతంలో హెచ్‌ఆర్ విభాగంలో పనిచేస్తూ అవినీతి, ఆరోపణలు ఎదుర్కొని బదిలీపై వెళ్లిన ఓ అధికారి తిరిగి అదే స్థానానికి వచ్చి మునుపటి హవా సాగిస్తున్నారు. ఇందుకు ఇద్దరు అధికారులు బాగా సహకరిస్తున్నట్లు సమాచారం. ఇందులో ఒకరు హెచ్‌ఆర్ విభాగం, మరొకరూ ద్వితీయ స్థాయి అధికారి కావడం గమనార్హం. విజిలెన్స్ విభాగంతో సంబంధం లేకపోయినా అన్నీ తానై సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం సమావేశాలకు హాజరై ఆయా మండలాల్లో వచ్చినంత పిండుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. డ్వామా నిఘా, హెచ్‌ఆర్ విభాగాలలో వసూళ్ల పర్వం సాగుతోందనేందుకు ఇటీవల ఆయా మండలాల్లో వసూళ్లే నిదర్శనం. నిఘా, హెచ్‌ఆర్‌లలో ప్రతి ఫైల్‌కు ఓ రేటు నడుస్తోందని ఆశాఖలో ఉద్యోగులే చర్చించుకుంటున్నారు.

17వ విడత సామాజిక తనిఖీలు పూర్తి

డ్వామా పరిధిలోని పథకాల్లో నిధుల దుర్వినియోగం, అక్రమాలపై విచారణ చేపట్టేందుకే సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 17విడతల సామాజిక తనిఖీలు పూర్తి కాగా, ప్రస్తుతం 18, 19వ విడతలు కొనసాగుతున్నాయి. అయితే ప్రభుత్వ సొమ్మును రికవరీ చేసి బాధ్యతగా వ్యవహరించాల్సిన నిఘా విభాగం అధికారులు తమ చేతివాటం ప్రదర్శిస్తూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు. విజిలెన్స్ విభాగంలో రూ.4కోట్లకు పైగా రికవరీ చేయాలని తేల్చారు. ఇప్పటి వరకు రూ.2 కోట్ల వరకు రికవరీ చేశారు. అయితే అక్రమాలకు పాల్పడిన ఉపాధి సిబ్బందిపై చర్యలు శూన్యం. ముడుపులు పుచ్చుకుని కేసులు మాఫీ చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడిచిన ఆరు నెలల కాలంలో విజిలెన్స్‌కు సంబంధం లేని అధికారి అన్నీ తానై మండల స్థాయిలో జరిగే సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం సమావేశాలకు హాజరు కావడం...హెచ్‌ఆర్ విభాగంతో కలిసి ముడుపులలో వాటాలు పంచుకోవడం డ్వామాలో చర్చకు తెరలేపింది.



ఇటీవల యల్లనూరులో నిర్వహించిన సామాజిక తనిఖీలో పాల్గొన్న డ్వామా అధికారులు

పారదర్శకంగా నిర్వహిస్తున్నాం

సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. ఇందులో ఎటువంటి సందేహాలు, సమస్యలు ఉన్నా నేరుగా నా దృష్టికి తేవచ్చు. ఎక్కడా ఒక్క పైసా కూడా ఆర్థికంగా లావాదేవీలు ఇందులో ఉండవు. ఇటువంటి వాటిని ఎవరూ ప్రోత్సాహించరు. సామాజిక తనిఖీల్లో తేల్చిన మొత్తాన్ని బాధ్యులు నుంచి రికవరీ చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు కూడా తీసుకుంటాం. క్లస్టర్లు, మండలాల వారిగా రికవరీపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. విజిలెన్స్ విభాగం నుంచి నిత్యం నిఘా ఉంటుంది.

-సలీంబాషా, డ్వామా పీడీ

నీరసించిన కాంట్రాక్టర్లు

- పల్లె పండుగ పనులకు మలి విడత నిధులు ఏవీ?
- పనులు చేసిన కాంట్రాక్టర్లలో ఆందోళన
- పర్సెంటేజీలు తీసుకున్న అధికారుల్లో గుబులు



పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్ ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పల్లె రోడ్ల పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్ల గురించి అసలు పట్టించుకోలేదు. దీంతో పల్లె ప్రజలు గుంతల రోడ్లపై ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈనేపథ్యంలో టీడీపీ నేతృత్వంలో ప్రభుత్వం కొలువుదీరగానే పల్లె పండుగ పేరుతో గుంతల రోడ్లకు మోక్షం కల్గించేలా మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. అలాగే అత్యవసరంగా నిర్మించాల్సిన చిన్నచిన్న రోడ్లను సైతం పూర్తి చేసేలా తగిన ప్రణాళిక తయారు చేయించింది. అందుకు అనుగుణంగా నిధులు కూడా విడుదల చేసింది. దీంతో కాంట్రాక్టర్లలో కొత్త ఉత్సాహం వచ్చింది. నిధుల కేటాయింపుతో అభివృద్ధి పనుల్లో వేగం పుంజుకుంది. పల్లె పండుగ పనులతో పాటు మరిన్ని పనులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పనులు పూర్తికాకనే నిధులు కేటాయించడంతో ఇక బిల్లుల చెల్లింపులకు ఢోకా ఉండదని కాంట్రాక్టర్లు సంబరపడ్డారు. పనుల్లో వేగం పెంచి, త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. ఈక్రమంలో కొందరు అధికారులకు సైతం అడ్వాన్సుగా పర్సెంటేజీలు ఇచ్చేసినట్లు సమాచారం. ఇందులో ఓ ఉన్నతాధికారి తనకు రావాల్సిన పర్సెంటేజీలు ముట్టడంతో ఫుల్ జోష్‌లో ఉన్నారన్న చర్చ జరుగుతోంది.

స్పీడ్‌కు బ్రేక్

ప్రభుత్వం మరోసారి నిధుల విడుదలకు సంబంధించి ఎలాంటి ముందడుగు లేకపోవడంతో కాంట్రాక్టర్ స్పీడ్‌కు బ్రేక్ పడింది. ఇప్పటికే పూర్తిస్థాయిలో పర్సెంటేజీలు పుచ్చుకున్న అధికారుల్లో సైతం గుబులు మొదలైందన్న చర్చ జరుగుతోంది. కాంట్రాక్టర్ల కంట పడితే ఏమి అడుగుతారో.. ఏమి సమాధానం చెప్పాలో అర్థం కాక అధికారులు మొహం చాటేస్తున్న పరిస్థితి. కొద్ది రోజులు ఇలాగే కొనసాగితే.. కొంత మంది కాంట్రాక్టర్లు బిల్లులు అయిన తరువాత మీ పర్సెంటేజీ సొమ్ము మీకు ఇస్తాం.. ప్రస్తుతానికి మేము ఇచ్చిన సొమ్ము మాకివ్వండి అనే పరిస్థితి వచ్చే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

మంజూరైన సిమెంట్ రోడ్లను పరిశీలిస్తే..

జిల్లా వ్యాప్తంగా 1961 పనులకు అనుమతులు మంజూరయ్యాయి. రూ.105.05కోట్లతో 217.18 కిలోమీటర్ల పొడవు రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. అనుమతించిన పనుల్లో ఇప్పటికే 1750 పూర్తి అయినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. దీంతో 198 కిలోమీటర్ల పొడవున పనులు పూర్తి చేశారు. 15 పనులకు సంబంధించి కొత్తగా అనుమతులు మంజూరయ్యాయి. ఇవికాకుండా మొత్తం రూ.90 కోట్ల పనులకు జిల్లాలో శ్రీకారం చుట్టారు. వీటికి సంబంధించి రూ.24.88 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రూ.80 కోట్ల వరకు కేవలం సీసీ రోడ్లకు సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉంది.

తారు రోడ్లను పరిశీలిస్తే..

జిల్లాలో మొత్తం 18 రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. రూ.30.19 కోట్లు కేటాయించారు. ఇందులో 10.39 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి. వీటికి సంబంధించి 4.86 కోట్ల నిధులు విడుదల చేశారు. 17.6 కిలోమీటర్లకు సంబంధించి నూతనంగా అనుమతులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభ దశలో ఉన్నాయి.



నిర్మాణ దశలో ఉన్న రోడ్డు

మా గ్రామం కనుమరుగయ్యేది



రాష్ట్ర ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి పూనుకోకపోతే మాగ్రామం కనుమరుగయ్యేది. ఎందుకంటే ఇప్పటికే ఈ ప్రాంతంలో బస్సుల రాకపోకలు లేక కళేకుర్తి రవాణా సౌకర్యానికి దూరంగా ఉంది. బస్సులన్నీ కణేకల్లులోని దిగువగేరి నుంచి మాల్యం మీదుగా వెళుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- మల్లి, మాజీ సర్పంచ్, కళేకుర్తి

పైప్‌లైన్ షిఫ్టింగ్ పూర్తి కాగానే..



కళేకుర్తి వద్ద నిర్మించనున్న బ్రిడ్జి కింది భాగంలో శ్రీరామిరెడ్డి పైప్ లైన్ ఉంది. ఇటీవల పనులు చేసేటపుడు పైపులైన్ అడ్డంకిగా మారడంతో దాన్ని పూర్తిగా ఇతర చోటికి షిఫ్టింగ్ చేయాలని నిర్ణయించాం. ఇందు కోసం రూ.రెండు కోట్లు ఆర్ అండ్‌బీ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అలాగే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కూడా షిఫ్టింగ్‌కు ప్రయత్నాలు చేస్తున్నారు. పైప్‌లైన్ షిఫ్టింగ్ పూర్తి అయిన వెంటనే బ్రిడ్జి పనులు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

-రవిశంకర్‌రెడ్డి, డీఈ, ఆర్‌అండ్‌బీ, రాయదుర్గం

విద్యార్థులకు అనుకూలం

మా గ్రామం నుంచి ప్రతి రోజూ దాదాపు వంద మంది విద్యార్థులు పాఠశాల, కళాశాలకు వెళ్తుంటారు. ఐదు కి.మీ. దూరం కణేకల్లుకు ప్రయాణించాలంటే గతంలో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కావు. బ్రిడ్జి ఏర్పాటైతే బస్సులన్నీ మా ఊరి మీదుగానే వెళతాయి. దీంతో విద్యార్థులకు కూడా బస్సు సౌకర్యం ఉండటంతో పాటు రవాణా సౌకర్యాలు కూడా మెరుగుపడతాయి. అలాగే ప్రజలు కూడా ఇబ్బంది పడకుండా ఉంటారు.

-మారెన్న, కళేకుర్తి



బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు (ఫైల్)



నూతన బ్రిడ్జి ఏర్పాటుకు సిద్ధం అవుతున్న స్థలం

కల సాకారం!

- వేదవతి హగరిపై బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం
- రూ.48 కోట్లతో పనులు ప్రారంభం
- కణేకల్లు-ఉరవకొండ ప్రజలకు తప్పనున్న బాధలు
- దశాబ్దాల నాటి సమస్యకు పరిష్కారం

కణేకల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండల ప్రజల నాలుగు దశాబ్దాల కల నెరవేరనుంది. మండల కేంద్రం నుంచి ఉరవకొండకు వెళ్ల దారిలో వేదవతి హగరిపై బ్రిడ్జి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతేగాక రూ.48.42 కోట్లను మంజూరు చేసింది. దీంతో పనులకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పయ్యావుల, కాలవ సమన్వయంతో..

టీడీపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడగానే ఇక్కడ బ్రిడ్జి ఏర్పాటుపై ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి సారించారు. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆర్థికమంత్రిగా ఉండగా, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విప్‌గా ఉండటంతో వీరిద్దరి సమన్వయంతో బ్రిడ్జి ఏర్పాటుకు రూ.48.42 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తికాగా శ్రీసాయి కన్‌స్ట్రక్షన్ పనులను దక్కించుకుంది. గత ఏడాది అక్టోబరు 12న విప్ కాలవ శ్రీనివాసులు బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.

శిథిలావస్థలో హెచ్చెల్సీ అక్విడెక్ట్



శిథిలావస్థకు హెచ్చెల్సీ అక్విడెక్ట్

స్థానిక వేదవతి హగరిపై 1984లో హెచ్చెల్సీ అక్విడెక్ట్‌ను నిర్మించారు. దీనిపై కణేకల్లు-ఉరవకొండ మధ్య వాహనాల రాకపోకలు సాగుతుండేవి. మూడేళ్ల కిందట అక్విడెక్ట్ శిథిలావస్థకు చేరుకుందని హెచ్చెల్సీ అధికారులు రహదారిని మూసివేశారు. దీంతో ప్రయాణికులు దిగువగేరు మీదుగా ఉన్న హగరిలో కొన్ని రోజులు ఆటోలలో రాకపోకలు సాగించారు. కానీ వర్షం వచ్చినపుడు ఆ దారి కూడా కొట్టుకుపోయింది. దీంతో హెచ్చెల్సీ అక్విడెక్ట్‌పైనే ఆటోలకు మాత్రమే అనుమతులు ఇచ్చి బస్సుల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. దీంతో కణేకల్లుతో పాటు మాల్యం, కళేకుర్తి, సొల్లాపురం, హనుమాపురం, తుంబిగనూరు, గరుడచేడు తదితర గ్రామాలకు వెళ్లాలంటే అనేక అగచాట్లు పడాల్సి వచ్చింది.

సమస్యపై దృష్టి సారించిన ప్రభుత్వం

కణేకల్లు- ఉరవకొండకు రోడ్డు సమస్యపై ప్రజాప్రతినిధులకు పలు సార్లు స్థానికులు వినతిపత్రాలు ఇచ్చి, బ్రిడ్జి అవసరాన్ని వివరించారు. ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రితో చర్చించి బ్రిడ్జికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా ఎన్‌డీపీ స్కీం కింద నిధులు మంజూరయ్యాయి. 1.9 కి.మీ. ఈ రహదారిలో 480 మీటర్లు బ్రిడ్జి కాగా మిగతాది స్థానిక అయ్యప్పస్వామి గుడి నుంచి కళేకుర్తి రహదారి వరకు డబుల్ రోడ్‌గా ఉంది. వేదవతి హగరిపై నిర్మించనున్న 480 మీటర్ల బ్రిడ్జి పొడవులో ఏడు మీటర్ల వెడల్పు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే పనుల ప్రక్రియ ప్రారంభం కాగా ఈ ప్రాంతంలోని శ్రీరామిరెడ్డి పైప్‌లైన్ అడ్డుగా ఉండడంతో దాన్ని షిఫ్టింగ్ చేసేందుకు కాంట్రాక్టర్లు అధికా రులకు ప్రతిపాదనలు పెట్టారు. అది పూర్తవ్వగానే పనుల వేగవంతం చేయనున్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు పేర్కొన్నారు.

గూడు చెదిరిన గువ్వలు..!

- అంతరించిపోతున్న పక్షిజాతులు
- ఆందోళనలో పక్షి ప్రేమికులు
- అడవులు, చిరుధాన్యాలు తగ్గిపోవడమే కారణమా?
- పంటలకు పురుగుమందుల వాడకంతో మృత్యువాత



అదిగదిగో... అక్కడ..
పచ్చరంగులో కనిపిస్తోందే అదే చిలుక..
ఇదిగో.. ఇక్కడ..
తెల్లగా
కనిపిస్తోందే
అది కొంగ
ఇటు
చూడూ..
ఆ కొమ్మపై
కూర్చుని కుహు
కుహూ
అంటోందే నల్ల పక్షి అదే కోయిల
ఇలా.. కొన్నేళ్ల కిందట పల్లెల్లో పసి
పిల్లలకు పెద్దలు చెప్పేవారు.
చెరువులు, కుంటలు, వాగులు, వంకల
వద్ద చెట్ల కొమ్మలపై చేరి ఉదయం,
సాయం సంధ్య వేళల్లో ఆ పులుగులు
చేసే కిలకిలరావాలు ఎంతో
ఆహ్లాదంగా ఉండేది.
ఇదంతా గతం
ప్రపంచీకరణ, సాంకేతిక
పరిణామాలతో అనేక పక్షి జాతులు
అంతరించిపోతున్నాయి.
కిలకిలరావాలు మాయమైపోయాయి.
ప్రస్తుతం పిల్లలకు ఫలానా పక్షి ఎలా
ఉంటుందంటే కంప్యూటర్‌లోనో లేక
సెల్‌ఫోన్‌లోనో చూపించాల్సిన
పరిస్థితి ఏర్పడిందని పక్షి ప్రేమికులు
ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తనకల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మూడు, నాలుగు దశాబ్దాల కిందట కనిపించిన అనేక పక్షి జాతులు నేడు అంతర్ధానం అయ్యాయి. గ్రామాల్లో ఇబ్బడిముబ్బడిగా కనిపించే కాకులు, గద్దలు, పిచ్చుకలు, కొంగలు కూడా తగు స్థాయిలో కనిపించడం లేదు. ఇప్పుడిప్పుడే ప్రభుత్వాలు కూడా పక్షుల రక్షణ పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి.

ఈ నేపథ్యంలోనే మండలంలో పనిచేస్తున్న జనజాగృతి స్వచ్ఛంద సంస్థ వివిధ సంస్థలతో కలిసి పక్షి జాతుల లెక్కింపు సర్వే కార్యక్రమం చేపట్టింది. ఇందులో అనేక విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఎన్నో రకాల పక్షి జాతులు అంతరించిపోతున్నట్లు సర్వేల ద్వారా తెలుస్తోంది. వేగంగా పెరుగుతున్న జనాభా కారణంగా గ్రామాల చుట్టూ ఉన్న కొండలు, గుట్టలు, వాగులు, వంకలు వ్యవసాయ భూములుగా మారిపో యాయి. విచ్చలవిడిగా రైతులు ఉపయోగిస్తున్న పురుగు మందులు కూడా పక్షి జాతులు అంతరించిపోవడానికి ప్రధాన కారణమని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. పట్టణాలు ఊహించని రీతిలో అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో పట్టణాల చుట్టూ ఉన్న పెద్ద వృక్షాలను సైతం తొలగిస్తున్నారు. రోడ్ల విస్తరణలో భాగంగా ఎన్నో ఏళ్లనాటి వృక్షాలు సైతం నేల కూలుస్తున్నారు. దీంతో గూడు చెదిరిన పక్షులు కాలక్రమేణ అంతరించిపోతున్నాయి.



సర్వే చేస్తున్న జనజాగృతి టీమ్

రసాయన ఎరువులతో చేటు

గ్రామాల్లో గతంలో నవధాన్యాలు, చిరు ధాన్యాలు సాగుచేసేవారు. పురుగుమందులు, రసాయనిక ఎరువులు వినియోగం ఉండేదికాదు. దీంతో పక్షి జాతులకు కావలసిన ఆహారం పుష్కలంగా పంట పొలాల్లో లభించేది. పురుగుమందులు వాడకపోవడంతో పక్షులకు కావలసిన పురుగులు లభించేవి. వంకలు, వాగులు, కుంటలు, చెరువుల్లో ఏడాది పొడవునా నీరుండేది. నీరు, ఆహారం పుష్కలంగా ఉండటం, భారీ వృక్షాల ఆవసంతో పక్షి సంతతి కూడా బాగా వృద్ధి చెందేది. ప్రస్తుతం వందలాది అడుగుల లోతు బోరుబావులు తవ్వుతున్నారు. దీంతో వంకలు, వాగులు, బావులు, కుంటల్లో సైతం వర్షం పడిన నెల, రెండు నెలల్లోపే నీరు ఇంకిపోతోంది. దీంతో పక్షి జాతులకు నీటి కరువు ఏర్పడుతోంది. వేసవిలో విచ్చలవిడిగా కొండలు, గుట్టలకు నిప్పు పెడుతుండటంతో అక్కడ కూడా రక్షణ లేక అనేక పక్షి జాతులు మృత్యువాత పడుతున్నాయి. ఇలాంటి అనేకానేక కారణాలతో పక్షి జాతులు అంతరించపోతున్నాయన్నది వాస్తవం. పక్షి జాతులను సంరక్షించకపోతే భవిష్యత్తులో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని పక్షిప్రేమికులు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలు, అడవుల్లో పక్షులు స్థావరాలు ఏర్పాటు చేసుకోవడానికి అనువైన ప్రాంతాల్లో ఎత్తైన మొక్కలు పెంచేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



చిన్నరామన్నగారిపల్లి వద్ద అరుదైన బ్లాక్‌స్టోరక్ పక్షి



95శాతం పక్షులు.. పురుగులనే తింటాయి



95 శాతం పక్షులు పురుగులు తినే జీవిస్తాయి. 5శాతం పక్షులు మాత్రమే గింజలు, కాయలు తింటాయని పక్షుల పరిశోధకుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన అశోక్ తెలిపాడు. నల్లమాడకు చెందిన ఈయన బీటెక్ చదివి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే వారంలో రెండురోజులపాటు అడవుల్లో సంచరిస్తూ, వివిధ రకాల పక్షులను గుర్తిస్తున్నారు. ఇప్పటికే మన ప్రాంతంలో బట్టమేక పిట్ట, కలిమికోడి కనిపించడం లేదని వెల్లడించారు. ప్రభుత్వాలు వీటికోసం నిధులు ఖర్చు చేసి సంరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉందని తెలిపారు. గత 20 సంవత్సరాలుగా మన ప్రాంతంలో కనిపించని బ్లాక్‌స్టోరక్ పక్షి ఇటీవల తనకల్లు మండలంలోని చిన్నరామన్నగారిపల్లి వద్ద కనిపించినట్లు పేర్కొన్నారు. ఇది అరుదైన పక్షి అని కాపాడుకోవాల్సి ఉందన్నారు.

-అశోక్, పక్షుల పరిశోధకుడు, నల్లమాడ

కాకులు, పిచ్చుకలు కూడా అంతరించిపోతున్నాయి



మాచిన్నప్పుడు గ్రామంలో ఏపుగా పెరిగిన చింత, వేపచెట్లు ఎక్కువగా ఉండేవి. చెట్ల నిండా కాకులు నివాసముండేవి. ప్రతి ఇంటిలోనా ఎక్కడో ఒకచోట పిచ్చుకల స్థావరాలుండేవి. నేడు కొట్టాల స్థానంలో కాంక్రీటు మిద్దెలొచ్చాయి. గ్రామంలోని ఎత్తైన చెట్లను కొట్టేశారు. ఈకారణంగా పక్షులు ఆవాసాలు కోల్పోవడంతో అవి అంతరించిపోతున్నాయి. నేటి యువతకు పక్షి జాతుల పట్ల కనీస అవగాహన లేదు. పాఠ్యపుస్తకాల్లో పక్షి జాతుల గురించి తెలియజేయాల్సి ఉంది.

- రెడ్డిశేఖర్ రెడ్డి, మల్లిరెడ్డిపల్లి

ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నాం



ప్రజల్లో పక్షులు, వన్యప్రాణుల పట్ల సంస్థ ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. వాటికి కావలసిన స్థావరాల కోసం గ్రామాల వద్ద అడవుల్లో మొక్కల పెంపకం చేపడుతు న్నాం. పక్షి జాతులు లెక్కింపు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం. ఇప్పటివరకూ 208 పక్షి జాతులను గుర్తించాం. ఇంకా గుర్తించాల్సినవి ఉన్నాయి. ప్రభుత్వాలు కూడా పక్షి జాతుల అభివృద్ధి కోసం చర్యలు చేపట్టాల్సి ఉంది.

- రామ్ ప్రసాద్, సీఈఓ, జనజాగృతి



ఇద్దరు హౌసింగ్ ఇంజనీర్లపై బదిలీ వేటు

పలువురికి నోటీసులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణంలో అక్రమాలకు పాల్పడి విచారణ ఎదుర్కొంటున్న ఇద్దరు ఇంజనీర్లపై బదిలీ వేటు పడింది. అలాగే పలువురికి నోటీసులు జారీ చేశారు. గత ప్రభుత్వంలో అనంతపురం అర్బన్‌లో డీఈగా ఉన్న కృష్ణారావు, పీడీ కార్యాలయంలో ఏఈగా ఉన్న వినోద్‌కుమార్ అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. విచారణ పెండింగ్‌లో ఉన్న డీఈ కృష్ణారావును కర్నూలుకి, ఏఈ వినోద్‌కుమార్‌ను చిత్తూరుకు బదిలీ చేస్తూ ఏపీ రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రాప్తాడు ఇన్‌చార్జి డీఈగా ఉన్న ప్రస్తుత బుక్కరాయసముద్రం ఏఈ, శింగనమల ఇన్‌చార్జి డీఈ దేవరకొండ రామమూర్తికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన అప్పటి రాప్తాడు డీఈ మహబూబ్‌బాషాకు నోటీసులు ఇచ్చారు. అప్పట్లో రాప్తాడు నియోజకవర్గంలో ఏఈగా ఉన్న అనిల్‌కుమార్‌ను విధుల నుంచి పూర్తిగా తొలగించారు. పవన్‌కుమార్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అప్పటి ఆత్మకూరు ఏఈలుగా పనిచేసిన జమీల్, కొండాభూషణ్, శ్రీనివాసులుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో సుమారు రూ.రెండు కోట్లకు పైగా అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఇంజనీర్లపై విచారణ సాగుతోంది. విచారణ అనంతరం ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హౌసింగ్ పీడీ శైలజ తెలిపారు.

జాతీయ డ్రాగన్ బోటింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు


కోచ్ శేఖర్‌తో ధోనిసింగ్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): డ్రాగన్ బోటింగ్ నేషనల్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు ఎంపికయ్యాడు. ఈనెల 24 నుంచి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే 13వ డ్రాగన్ బోటింగ్ జూనియర్ నేషనల్ పోటీలకు నగరానికి చెందిన ధోనిసింగ్ ఎంపికయ్యాడు. ప్రస్తుతం కోచ్ శేఖర్ పర్యవేక్షణలో ధోనిసింగ్ కర్నూలులో బోటింగ్‌పై సాధన చేస్తున్నాడు. జాతీయ బోటింగ్ పోటీలకు ఎంపికైనందుకు ఎంకే స్పోర్ట్స్ అకాడమీ హెడ్‌కోచ్ రాహుల్ అభినందనలు తెలిపారు.

వేసవి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): శాప్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆసక్తి, అర్హత ఉన్న కోచ్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. 2025 సంవత్సరానికి గాను జిల్లాలో 50 వేసవి శిక్షణ శిబిరాలు మే 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడా శిక్షకులు, పీడీ, పీఈటీలు, సీనియర్ ప్లేయర్లు, కోచ్‌లు, సర్టిఫికెట్ కోర్సు చేసిన శిక్షకులు అర్హులని పేర్కొన్నారు. 8-14 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలను గుర్తించి క్రీడలపట్ల ఆసక్తి పెంచడానికి ప్రతిభావంతులైన క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కోచ్‌లు కృషి చేయాలని అన్నారు. అర్హతగల అభ్యర్థులు ఈనెల 21వతేదీ సాయంత్రంలోపు అశోక్‌నగర్, డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 08554-315632ను సంప్రదించాలని తెలిపారు.

టార్గెట్ పూర్తి చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): యాంత్రీకరణ పథకానికి సంబంధించి ఈనెల 24లోగా ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. స్థానిక జేడీఏ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏడీఏలు, ఏఓలతో ఆమె సమావేశమయ్యారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి యాంత్రీకణ పథకానికి రూ.3 కోట్లు టార్గెట్ ఇవ్వగా, ఇప్పటి దాకా రూ.1.07 కోట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన మొత్తాన్ని ఈనెల 24లోగా పూర్తి చేసేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈనెల 30లోగా తమ వాటా డబ్బులు చెల్లించిన రైతులకు యాంత్రీకరణ పరికరాలు సరఫరా చేయాలన్నారు. జిల్లాకు 35 డ్రోన్లు కేటాయించారని, ఇప్పటి దాకా 25 రైతు గ్రూపులు ఏర్పాటు చేసి, మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిలిన గ్రూపులను త్వరగా ఏర్పాటు చేసి, డ్రోన్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా వేసవి కాలంలో పంటలు సాగు చేసి ఉంటే ఆయా పంటలకు ఈ క్రాస్ చేయాలన్నారు.

నేడు 'శ్రమకావ్యం' పుస్తక గానసభ

హాజరు కానున్న సుద్దాల అశోక్ తేజ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఐద్వా, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, జేవీవీ, యూటీఎఫ్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు జిల్లా కేంద్రంలోని జడ్పీ హాలులో 'శ్రమకావ్యం' పుస్తక గాన సభ నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి పేర్కొన్నారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... సమాజ అభివృద్ధిలో శ్రమ మార్పు, ఆధునిక కాలంలో దాని గొప్పతనం, అసమానతలతో కూడిన నేటి సమాజం ఎలా మారుతుందో ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ 'శ్రమకావ్యం' పుస్తకం రూపంలో వివరించారని అన్నారు. త్వరలో మేడే రానున్న నేపథ్యంలో ఆదివారం నిర్వహించనున్న పుస్తక గాన సభకు గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్వీ నాయుడు, తిరుపాలు, బాలరంగయ్య, వీరరాజు, పరమేష్, చంద్రిక, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, ప్రొఫెసర్లు


క్రీడా పోటీలలో సాధించిన ట్రోఫీలతో విజేతలు.. ప్రిన్సిపాల్ తదితరులు

సాంకేతిక విద్యాదీప్తి జేఎన్టీయూ

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి

అట్టహాసంగా కాలేజీ డే.. స్పోర్ట్స్ డే


లేడీ జాక్సన్.. మూన్ వాక్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అనంతపురం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల 79 సంవత్సరాలుగా సాంకేతిక విద్యాదీప్తిగా వెలుగొందుతోందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి అన్నారు. వర్సిటీలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో శనివారం కాలేజీ డే.. స్పోర్ట్స్ డే నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, సీనియర్ ప్రొఫెసర్ దేవన్న, ఇన్‌చార్జి ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జోజిరెడ్డితో కలిసి ఆయన వేడుకలను ప్రారంభించారు. జేఎన్‌టీయూలో చదివిన వేలాది మంది ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో స్థిరపడ్డారని అన్నారు. శాస్త్రవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలు అందిస్తున్నారని అన్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్, కెమికల్ ఇంజనీరింగ్ కోర్సుల ద్వారా ప్రతి సంవత్సరం 400 మందికిపైగా బీటెక్ పట్టాలు పొందుతున్నారని వివరించారు. అధునాతన ల్యాబ్‌లు, లైబ్రేరీలు, అపార అనుభవం ఉన్న టీచింగ్ ఫ్యాకల్టీ తమ కళాశాల సొంతమని అన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.


సినిమా పాటకు స్టెప్పులు

ఉత్సాహంగా క్రీడాపోటీలు

టీచింగ్ ఫ్యాకల్టీ క్రికెట్ పోటీల్లో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి టీమ్ గెలుపొందింది. క్యారమ్స్ సింగిల్స్‌లో ప్రొఫెసర్ వసుంధర గెలిచారు. సివిల్ విభాగాధిపతి అజిత రన్నర్‌గా నిలిచారు. డబుల్స్‌లో భారతి, మాధవి విజేతలు, అజిత, లలిత కుమారి రన్నర్‌గా నిలిచారు. టెన్నికాయిట్‌లో వసుంధర గెలవగా, లలితకుమారి రెండో స్థానంలో నిలిచారు. డబుల్స్‌లో అజిత, మాధవి విజయం సాధించగా, వసుంధర, మాధవి రెండో స్థానంలో నిలిచారు. టేబుల్ టెన్నిస్‌లో సురేష్‌బాబు గెలవగా, భానుమూర్తి రెండో స్థానంలో నిలిచారు. డబుల్స్‌లో శశిధర్, శివకుమార్ విజేతలు కాగా, జీఎస్ఎస్ రాజు, కళ్యాణ్‌కుమార్ రెండో స్థానంలో నిలిచారు. టీచింగ్ అసిస్టెంట్ ఉమెన్ విభాగంలో బ్యాడ్మింటన్ విన్నర్‌గా అనూష నిలిచారు. చంద్రుష రెండో స్థానంలో నిలిచారు. డబుల్స్‌లో ఫిర్‌దోజ్, కళ్యాణి రన్నర్స్‌గాను మాధురి, మానస రన్నర్స్‌గా నిలిచారు. క్యారమ్స్‌లో చంద్రూష విన్నర్, మాధురి రన్నర్‌గా నిలిచారు. డబుల్స్‌లో అనూష, మానస గెలవగా, ఫిర్‌దోజ్, కళ్యాణి రెండో స్థానంలో నిలిచారు. క్రికెట్‌లో శశిధర్ రెడ్డి టీం విజయం సాధించగా సోమశేఖర్‌రెడ్డి కెప్టెన్ టీం రన్నరప్‌గా నిలిచింది. వాలీబాల్ పోటీల్లో కెప్టెన్ దాదా ఖలందర్ టీం గెలిచింది. కెప్టెన్ ఈశ్వర్ టీం రెండో స్థానంలో నిలిచారు. విద్యార్థుల క్రికెట్ పోటీల్లో మెకానికల్ స్టూడెంట్స్ విన్నర్‌గాను, కెమికల్ స్టూడెంట్స్ రన్నరప్‌గా నిలిచారు. వాలీబాల్ పోటీల్లో కెమికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు విజయం సాధించారు. మెకానికల్ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. బాస్కెట్ బాల్ పోటీలో ఈసీఈ విన్నర్‌గా, సివిల్ రన్నరప్, హ్యాండ్‌బాల్‌లో విన్నర్‌గా కెమికల్ ఇంజనీరింగ్ విభాగం, రన్నరప్‌గా సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు నిలిచారు. ఖో-ఖో పోటీల్లో సివిల్ విద్యార్థులు గెలవగా, కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. కబడ్డీలో కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు గెలవగా, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు.

జేఈఈ మెయిన్‌లో అనంత విద్యార్థులు అదుర్స్

నితిన్ అగ్నిహోత్రికి ఆలిండియా 67వ ర్యాంకు

పలువురు విద్యార్థులకు మెరుగైన ర్యాంకులు

అనంతపురం విద్య, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ సెషన్-2 ఫలితాల్లో అనంతపురం జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. జిల్లాకు చెందిన విద్యార్థి నితిన్ అగ్నిహోత్రి ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 67వ ర్యాంకు సాధించాడు. ఈ నెల మొదటి వారంలో నిర్వహించిన జేఈఈ మెయిన్ సెషన్-2 పరీక్షల ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) శుక్రవారం రాత్రి విడుదల చేసింది. ఇందులో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతోపాటు ఉత్తమ పర్సంటైల్ సాధించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబికులు ఆనందం వ్యక్తం చేశారు.

మంచి బిల్డర్‌గా ఎదుగుతా: నితిన్

అనంతపురం నగరం మూడో రోడ్డులో నివాసం ఉండే కళ్యాణి, శ్రీకాంత్‌ల దంపతుల కుమారుడు భూపతి నితిన్ అగ్నిహోత్రి జేఈఈ మెయిన్ -2 పరీక్షల ఫలితాల్లో అదరగొట్టాడు. 300 మార్కులకు 290 మార్కులు సాధించాడు. ఆలిండియా స్థాయిలో 99.997 పర్సంటైల్ సాధించి 67వ ర్యాంకు దక్కించుకున్నాడు. విద్యార్థి భూపతి నితిన్ అగ్నిహోత్రి శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ' మా నాన్న బిల్డర్. మా అన్న గువాహటిలో ఐఐటీ చదువుతున్నాడు. నాకు ఇంటర్‌లో 984 మార్కులు వచ్చాయి. నాకు మంచి ర్యాంకు వచ్చింది కాబట్టి ఏదైనా ప్రముఖ ఐఐటీ కాలేజ్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేస్తా. తర్వాత మా నాన్న కలల ప్రపంచంలో అడుగుపెట్టి మంచి బిల్డర్‌గా ఎదగాలన్నదే నా కల' అన్నారు.

నారాయణ విద్యార్థుల హవా

జేఈఈ మెయిన్ సెషన్-2 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సొంతం చేసుకున్నట్లు కళాశాల కోర్ డీన్ బద్రీనాథ్, డీజీఎం వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారు ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ...తమ విద్యార్థి భూపతి నితిన్ అగ్నిహోత్రి ఓపెన్ కేటగిరీలో 67వ ర్యాంకు సాధించి చరిత్ర సృష్టించాడన్నారు. పలువురు విద్యార్థులు ఓపెన్ కేటగిరీలో మంచి పర్సంటైల్ పొందారన్నారు. మహమ్మద్ ఆసిఫ్ 99.48 పర్సంటైల్‌తో 8053వ ర్యాంకు, భావన 99.43 పర్సంటైల్‌తో 8792వ ర్యాంకు, విశాల్ 99.36 పర్సంటైల్‌తో 9335వ ర్యాంకు, సవిత్‌కుమార్ రావు 99.32 పర్సంటైల్‌తో 10,473వ ర్యాంకు సాధించారన్నారు. 99 పర్సంటైల్ ఐదుగురు విద్యార్థులు, 98 పర్సంటైల్‌తో ఏడుగురు, 97 పర్సంటైల్‌పైన 12 మంది, 94 పర్సంటైల్ పైన 18 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీన్ శ్రీనివాసరెడ్డి,ఏజీఎంలు చంద్రశేఖర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపాళ్లు రవిశంకర్‌రెడ్డి, ఓబన్నగౌడ్, శిఖామణి, శైలజ, హిమబిందు, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.



నితిన్ అగ్నిహోత్రిని హైదరాబాద్‌లో అభినందిస్తున్న నారాయణ యాజమాన్యం

ఎస్ఆర్ కాలేజ్ విద్యార్థులకు ర్యాంకులు



ఎస్ఆర్ కాలేజీలో...

జేఈఈ మెయిన్ ఫలితాల్లో పలువురు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని ఎస్ఆర్ విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జి శివకుమార్, డీన్ రాధాకృష్ణ, ఏజీఎం జగన్ తెలిపారు. ఉత్తమ ర్యాంకులు పొందిన విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ తమ విద్యార్థి ఫణీంద్రకు 116 ర్యాంకు, కావ్యశ్రీకి 826వ ర్యాంకు, భవ్య 1150, చరణ్‌కుమార్ రెడ్డి 3776, శివ సాయినాయక్ 17304, తరుణ్‌కుమార్ 33,681, క్రిష్ణబాబు 34259, చరణ్ నాయక్ 38510, పవన్‌కుమార్ నాయక్ 38775, జగన్ కుమార్ నాయక్ 40140, మణికంఠ 42838, శ్రీకర్ 43685, హేమంత్ నాయక్ 44339, ప్రకాష్ నాయక్ 45918 ర్యాంకు సాధించారన్నారు. 1000లోపు ర్యాంకులు ఇద్దరికి, 2వేలలోపు ఇద్దరికి, 50 వేల లోపు 15 మందికి ర్యాంకులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఏజీఎం వెంకటేశ్వర్లు, కల్పన, ప్రిన్సిపాళ్లు జగదీష్‌బాబు, భవానీ తదితరులు పాల్గొన్నారు.




ఉత్తమ ర్యాంకులు సాధించిన తేజ కాలేజీ విద్యార్థులు నందకుమార్, చందన, సురేందర్‌బాబు

తేజ జూనియర్ కాలేజ్ విద్యార్థుల హవా

తేజ జూనియర్ కాలేజ్ విద్యార్థులు జేఈఈ మెయిన్ ఫలితాల్లో మంచి ర్యాంకులు సాధించారని డైరెక్టర్ తేజేశ్వర్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఉమాదేవి తెలిపారు. వారు మాట్లాడుతూ ఆలిండియా స్థాయిలో నంద కుమార్‌రెడ్డి 151వ ర్యాంకు, చందన 414వ ర్యాంకు, సురేంద్ర బాబు 1153వ ర్యాంకు, చరణ్ కుమార్ 1,355వ ర్యాంకు, నందీశ్వర్‌రెడ్డి 1,381వ ర్యాంకు, హరిత 8272వ ర్యాంకు, కిషాన్ 20346వ ర్యాంకు, నవనీత్ క్రిష్ణ 26602వ ర్యాంకు, సుధీర్‌కుమార్ 28993వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెలిమేపల్లికి చెందిన టి.రంగప్ప కుమారుడు రంగస్వామి(35) ఈతకు వెళ్లి మృతి చెందాడు. రంగస్వామి కర్ణాటకలో తన భార్య ఊరిలో వ్యవసాయం చేసి జీవిస్తూ వుండేవాడు. శనివారం చెలిమేపల్లికి వచ్చి మిత్రులతో గోవిందయ్యదొడ్డి వద్ద వ్యవసాయ పొలంలో ఉన్న బావిలో ఈతకు వెళ్లి మునిగిపోయాడు. మిత్రులు బంధువులకు సమాచారం ఇచ్చారు. కళ్యాణదుర్గం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ నరేంద్రకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్ట్

హిందూపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలం జి. గుడ్డంపల్లికి చెందిన సుబ్బరాయప్పను హత్యచేసిన కేసులో అదే గ్రామానికి చెందిన నంజయ్యగౌడ్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు తెలిపారు. నీ భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని కొన్నాళ కిందట నంజయ్యగౌడ్‌తో సుబ్బరాయప్ప అన్నాడు. అది నిజమని నమ్మి నంజయ్యగౌడ్ మద్యం తాగివచ్చి భార్యను చిత్రహింసలు పెట్టేవాడు. విసిగిపోయిన ఆమె నంజయ్యగౌడ్‌ను వదిలేసి బెంగళూరు వెళ్లిపోయింది. దీంతో అప్పటి నుంచి ఆయన ఒంటరిగా ఉన్నాడు. గ్రామంలో కూడా ఆయన్ను పట్టించుకునేవారు కాదు. ఈ తరుణంలో ఈనెల 15న మద్యం సేవించి సుబ్బరాయప్ప ఇంటివద్దకు వెళ్లి 'నీవు చెప్పిన మాటలు విని నా భార్యను కొట్టడం వల్లే వెళ్లిపోయింది' అని గొడవపడ్డాడు. కోపంతో అక్కడే ఉన్న ఇటుకపెల్లలు తీసుకుని సుబ్బరాయప్ప తలపై మోదాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను కుటుంబ సభ్యులు బెంగళూరుకు తరలిస్తుండగా మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు నంజయ్యగౌడ్‌ను శనివారం గోళ్లాపురం పారిశ్రామికవాడలో అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు.


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్ఐ

కారు ఢీకొని యువకుడి మృతి

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిపల్లి సమీపంలో 44వ జాతీయరహదారిపై శనివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో మల్లేష్ (21) మృతి చెందాడు. కియ పోలీసులు తెలిపిన మేరకు చెన్నేకొత్తపల్లి మండలం చిన్నపల్లి గ్రామానికి చెందిన ముత్యాలప్ప, పార్వతమ్మల కుమారుడు మల్లేష్ మూడు నెలల నుంచి కియ అనుబంధ పరిశ్రమ అనంతటెక్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ద్విచక్రవాహనంపై పరిశ్రమకు వెళ్తూ అమ్మవారిపల్లి వద్ద బంక్‌లో పెట్రోల్ వేయించుకుని రోడ్డు దాటుతుండగా బెంగళూరు వైపు నుంచి అనంతపురం వెళ్లే కారు ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలం పరిశీలించి మృతదేహాన్ని పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. తల్లి పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

బస్టాండులో గుర్తుతెలియని వ్యక్తి...


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ధర్మవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తుతెలియని యువకుడు(32) మృతి చెందాడు. ప్రయాణికుల సమాచారంతో పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. వివరాలు తెలిసిన వారు 9440796831, 9440552808, 9440732538 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

వివాహిత ఆత్మహత్య

చిలమత్తూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డిచెన్నంపల్లికి చెందిన పవిత్ర (24) అనే వివాహిత శనివారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపిన మేరకు.. పవిత్రకు అదే గ్రామానికి చెందిన అశోక్‌తో వివాహమయింది. ప్రస్తుతం 15 నెలల పాప ఉంది. కడుపునొప్పితో తీవ్ర ఇబ్బందుపడుతుండేది. చికిత్సలు చేయించినా ఫలితం లేకపోవడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. మృతురాలి తల్లి గంగరత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.19వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.3 వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఆక్రమణల తొలగింపు


రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించిన దృశ్యం

గార్లదిన్నె, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక డ్యాం రోడ్డులో అక్రమ కట్టడాలని శనివారం పంచాయతీ అధికారులు తొలగించారు. డ్యాం రోడ్డు సర్కిల్ నుంచి పెనకచెర్ల వైపు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా స్థానికులు ఆక్రమించారు. దీంతో బస్సులు, లారీలో, ట్రాక్టర్లు, ఆటోలు వెళ్లే సమయంలో ఎదరుగా ఏవైనా వాహనాలు వస్తే ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోడ్డు స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు శనివారం పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


లింగనపల్లిలో గోకులం షెడ్డు ప్రారంభిస్తున్న మురళి

రాప్తాడు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని టీడీపీ రాప్తాడు మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి అన్నారు. మండలంలోని లింగనపల్లి గ్రామంలో రూ.2 లక్షలతో రైతు ఆదినారాయణరెడ్డి నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును శనివారం ఆయన ప్రారంభించారు. కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై ఆందోళన వద్దు


మాట్లాడుతున్న ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ఆందోలన చెందాల్సిన అవసరం లేదని సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా కో-ఆర్డినేటర్ వన్నూరప్ప, ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక అన్నారు. శనివారం సీపీఓ సమావేశపు హాల్‌లో ఎస్సీ సంక్షేమ వసతి గృహ వార్డెన్లకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద వివరాలు అర్జీదారుడికి అందజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. దానికోసం ప్రత్యేక చట్టమే ఉందన్నారు. ఏఎస్‌డబ్ల్యూఓలు, వార్డెన్లు, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

నార్పల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): నార్పల క్రాసింగ్‌లో ఉన్న షాలేము ప్రార్థన మందిరం నుంచి పాస్టర్ హెచ్ డేవిడ్ ఆధ్వర్యంలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పంచాయతీ కార్యాలయం వరకు కొనసాగింది. పాస్టర్ ఆర్‌వీఎం సదానందం మాట్లాడుతూ యేసుక్రీస్తు ప్రజలందరి పాపాల కోసం శిలువలో మరణించి సమాధి అయిన అనంతరం పునరుత్థానం చెందారన్నారు. మండల పాస్టర్స్ సదానందం, మహారాజు, జాన్, అన్నస్‌బాబు, యేసన్న, పాల్, యోసేపు, జాన్, ఆనంద్‌రాజు, దేవమణి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై అధికారుల ఆగ్రహం


హోటల్ నిర్వాహకుడిని హెచ్చరిస్తున్న ఆహారభద్రత శాఖ అధికారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు టిఫెన్ సెంటర్లలో ఇడ్లీ ప్లేట్లపై ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నారన్న ఫిర్యాదు నేపథ్యంలో ఆహార భద్రత శాఖాధికారులు తనిఖీలు నిర్వహించారు. శనివారం జిల్లా ఆహారభద్రతాధికారి కళ్యాణ్‌చక్రవర్తి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమ్ సిబ్బందితో కలిసి టిఫెన్ సెంటర్లపై దాడి చేశారు. కలెక్టరేట్ సమీపంలోనున్న వినాయక హోటల్, అయ్యప్పస్వామి హోటల్‌లో ఇడ్లీ ప్లేట్లపై ప్లాస్టిక్ కవర్లు వాడటాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్ఎస్ఎస్ఏ యాక్ట్ 2006 కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సాయి ట్రస్టు ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో నిర్వహించనున్న అరుణాచలేశ్వరుని పూజకు సంబంధించిన పోస్టర్లను శనివారం రాయలచెరువు శక్తిపీఠం ఆధ్యాత్మిక బోధకుడు నండూరి శ్రీనివాస్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ... అరుణాచలం వెళ్లలేని భక్తులకోసం నగరంలోనే అరుణాచలం ఉత్సవమూర్తులకు అరుణాచల పూజారులచే పూజలు నిర్వహించనుండడం అభినందనీయమన్నారు. ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ మాట్లాడుతూ... 26న ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు మూడో రోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాల్ 1వ గేట్‌లో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విధుల్లో చేరిన హౌసింగ్ పీడీ శైలజ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గత 15రోజులుగా సెలవు లో ఉన్న హౌసింగ్ పీడీ శైలజ విధుల్లో చేరారు. కంటికి శస్త్ర చికిత్సకోసం ఈనెల మూడో తేదీ నుంచి 15రోజుల పాటు ఆమె సెలవుపై వెళ్లారు. పంచాయతీ రాజ్ ఎస్ఈ జహీర్‌అస్లాం ఇన్‌చార్జిగా కొనసాగారు. శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకున్న శైలజ శనివారం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి హౌసింగ్ పీడీగా మళ్లీ బాధ్యతలు చేపట్టారు.

సామాజిక భద్రతకు సైబర్ సెక్యూరిటీ కీలకం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్


'ఇంపాక్ట్ ఆఫ్ ఏఐ ఆన్ సైబర్‌సెక్యూరిటీ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సామాజిక భద్రతలో సైబర్ సెక్యూరిటీ ఎంతో కీలకపాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. నగరానికి చెందిన గాజుల మోహన్‌కుమార్ గతంలో అమెరికా డిఫెన్స్ నేషనల్ సైబర్ సెక్యూరిటీ ప్రొటోకాల్ విభాగంలో పనిచేశారన్నారు. ప్రస్తుతం అమెరికాలోని వెల్స్ ఫార్గో టెక్నాలజీ సంస్థలో రూ.1.30కోట్ల వార్షిక వేతనంతో అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. క్లౌడ్ స్టేట్ యూనివర్సిటీలో సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్, అధునాతన కంప్యూటర్ టెక్నాలజీ కోర్సులపై మాస్టర్స్ పూర్తి చేశారన్నారు. ఈ అనుభవంతో 'ఇంపాక్ట్ ఆఫ్ ఏఐ ఆన్ సైబర్‌సెక్యూరిటీ' పుస్తకాన్ని రచించారన్నారు. శనివారం ఎమ్మెల్యే చేతులమీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. యూనివర్సిటీలలో ఈ పుస్తకాన్ని పాఠ్యాంశాలుగా తీసుకురావాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రస్తుత కాలంలో ఏఐ గురించి అందరూ తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. పుస్తకాన్ని పాఠ్యాంశంగా తీసుకొచ్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. మాదినేని మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు ఎవరూ సరిరారు..

అనంతపురం అర్బన్: సీఎం చంద్రబాబునాయుడుకు ఎవరూ సరిరారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. శనివారం అర్బన్ టీడీపీ కార్యాలయం లో సీఎం చంద్రబాబు 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని సీబీఎన్ కామన్ డీపీ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నాయకులు మణి రవి, సరిపూటి రమణ, లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

మాజీ గవర్నర్‌ను కలిసిన ప్రభాకర్ చౌదరి


మాజీ గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ప్రభాకర్ చౌదరి

అనంతపురం రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మాజీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ను అవే వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభాకర్ చౌదరి కలిశారు. శనివారం ఒడిశాలో జరిగిన అవే సభ్యుల సామాజిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మాజీ గవర్నర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

శింగనమల ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు సరికాదు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీపై కొందరు నాయకులు అసత్య ప్రచారాలు చేయడం సరికాదని ఆ నియోజకవర్గ టీడీపీ నాయకులు అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, పసుపుల శ్రీరామిరెడ్డి, జీసీ బాబు, ఆదినారాయణ మీడియాతో మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే తెలియజేశారన్నారు. అయితే కొంత మంది ఎమ్మెల్యేను కలవకపోయినా, తమను పట్టించుకోవడం లేదంటూ అసత్య ఆరోపణలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇన్‌చార్జి మంత్రి పర్యటన సమయంలో కొందరు నాయకులు ఉద్దేశ్యపూర్వకంగా గొడవకు దిగారన్నారు. ఎమ్మెల్యేను బ్లాక్ మెయిల్ చేసే విధంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారన్నారు. అందరితో కలిసి పనిచేసేందుకు ఎమ్మెల్యే సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు ఓబుళపతి, రాజేంద్ర, చిన్న ఆంజనేయులు, సామల మధు పాల్గొన్నారు.

సంజీవరాయుడు మృతి టీడీపీకి తీరని లోటు

నార్పల,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగనపల్లి గ్రామ టీడీపీ నాయకుడు పత్తిపాటి సంజీవరాయుడు మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు అన్నారు. శనివారం సంజీవరాయుడు అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆయన వారి ఇంటికి వెళ్లి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. పిట్టురంగారెడ్డి, గంగనపల్లి రాము, ఎర్రినాగప్ప, జాఫర్ పాల్గొన్నారు.

అరటి పిలకల పేరుతో రైతులకు కుచ్చుటోపీ

గార్లదిన్నె, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అరటి పిలకలు సరఫరా చేస్తానని నమ్మబలికి రైతుల నుంచి రూ.2లక్షలు వసూలు చేసి కుచ్చుటోపీ పెట్టిన సంఘటన శనివారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కల్లూరుకు చెందిన దాదాగాంధీ, దస్తగిరి అనే రైతులు అరటి పంటను సాగుచేసేందుకు 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. అరటి పిలకలు సరఫరా చేసే వారి కోసం వెతికారు. నార్పల మండలానికి చెందిన శివయ్య అనే వ్యక్తి అరటి పిలకలు ఇప్పిస్తానని వారిని నమ్మబలికాడు. రైతులను గత నెల బెంగుళూరులోని ఓ నర్సరీ వద్దకు తీసుకెళ్లి పిలకలను చూపించాడు. రూ.15 చొప్పున రైతులతో ఒప్పందం చేసుకున్నాడు. ఇది నమ్మిన ఇద్దరు రైతులు 18వేల పిలకలకు రూ.2 లక్షలకు మాట్లాడుకున్నారు. శివయ్య తనకు ఫోన్‌పే లేదని మరో వ్యక్తికి అకౌంటుకు నగదు బదలాయించుకున్నాడు. ఏప్రిల్ 10 నాటికి అరటి పిలకలు అందచేస్తానని వారిని నమ్మించాడు. అరటి సాగుకు అవసరమైన సేద్యాన్ని రైతులు పూర్తి చేశారు. పిలకలు నాటేందుకు సమయం దగ్గరపడతున్నా ఆ వ్యక్తి అందించకపోవడంతో అనుమానం వచ్చి డబ్బు ట్రాన్స్‌ఫర్ చేసిన వ్యక్తిని గుర్తించారు. అతని ద్వారా శివయ్య ఆచూకీ కనుగొన్నారు. రైతులు నార్పలకు వెళ్లి శివయ్యను గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న నార్పల మండలంలోని మరో పది రైతులు గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోలీసులకు శివయ్య తమను మోసగించాడని పోలీసుల ఎదుట వాపోయారు. అనంతరం నార్పల పోలీస్‌స్టేషన్‌లో కేసు పెడతామని రైతులందరూ శివయ్యను తీసుకెళ్లినట్లు తెలిసింది.

బస్సు బోల్తా..

అనంతపురం క్రైం,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): బస్సు బోల్తా పడిన ఘటనలో డ్రైవర్, క్లీనర్‌తో పాటు ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. శనివారం గుడ్ చిల్డ్రన్స్‌కు చెందిన స్కూల్ బస్సుతో డ్రైవర్ సురేంద్ర ఆలమూరు నుంచి బయుదేరాడు. బస్సులో క్లీనర్ నాగరాజు నాయక్, సురేంద్ర కుమారుడు విష్ణు, కుమార్తె మేమశ్రీ ఉన్నారు. ఆలమూరు రోడ్డులో బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ సురేంద్ర, క్లీనర్ నాగరాజు నాయక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సురేంద్ర పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అనంతపురం రూరల్ పోలీసులు ఘటనపై ఆరా తీస్తున్నారు.

నేడు అభినందన సభ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కందుకూరి విశిష్ట పురస్కారాలు అందుకున్న 13 మంది కళాకారులకు ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేసినట్లు లలితకళాపరిషత్ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5.30 గంటలకు జిల్లాకేంద్రంలోని లలితకళా పరిషత్‌లో సభ ఉంటుందన్నారు. అనంతపురం జిల్లా తరఫున వాల్మీకి కుళ్లాయప్ప, సోమర లక్ష్మీనారాయణ, సంగాల నారాయణస్వామి, పి.ఆనంద్, జేకే రామాంజనేయులు, వి.ఆదినారాయణరెడ్డి, జీజే ఎర్రిస్వామి, ఎ.రామగోపాల్, జి.నరహరి, ఎస్ నారాయణస్వామి, శివశంకర్, డి.రాజకుళ్లాయప్ప, బి.వరప్రసాద్ పురస్కారాలు అందుకున్న విషయం తెలిసిందే. వీరిని జిల్లా ప్రజా ప్రతినిధులచేత సన్మానించనున్నట్లు తెలిపారు. అనంతరం పంచరత్నాలు ఉచిత నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

దివ్యాంగుల భవనానికి స్థలం కేటాయించండి

శింగనమల ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దివ్యాంగులకు మండల సమైక్య భవనం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు తరిమెల చాకలి నారాయణ కోరారు. శనివారం అనంతపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంఘం నాయకులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని కలసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 300 మంది దివ్యాంగుల సంఘంలో ఉన్నారని, ఏదైనా సమావేశం నిర్వహించేందుకు భవనం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఆదినారాయణ, బాలిరెడ్డి, సుబ్బమ్మ, కుళ్లాయమ్మ, పుల్లమ్మ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

అనంతపురం క్రైం,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి) :నగరంలోని భైరవనగర్‌కు చెందిన ఓ మహిళ అదృశ్యమైంది. శుక్రవారం ఉదయం జ్యోతి తన ఇంటి నుంచి ఏదో పని ఉందని చెప్పి బయటకు వెళ్లిపోయింది. రాత్రయినా ఇంటికి రాలేదు. శనివారం ఆమె కుమారుడు శరత్‌చంద్ర ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

వన్‌టౌన్ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

వన్‌టౌన్ ఎస్ఐ దేవరకొండ లక్ష్మీనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇది వరకు ఆత్మకూరు ఎస్ఐగా పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

భూసార పరీక్షల నిర్వహణపై అవగాహన

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అనంతపురం భూసార పరీక్షా కేంద్రంలో శనివారం ఎస్కేయూ విద్యార్థులకు భూసార పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. ముందుగా మట్టి నమూనాల సేకరణ విధానంతోపాటు భూసార పరీక్షల ఉపయోగాలపై ఏడీఏ రోజా పుష్పలత అవగాహన కల్పించారు. ఉదజని సూచి, ఆర్గానిక్ కార్బన్, నత్రజని, భాస్వరం, పొటాషియం, సల్ఫర్, బోరాన్, సూక్ష్మపోషకాలైన జింక్, మాంగనీస్, ఐరన్, కాపర్ విశ్లేషణ పద్ధతులను వివరించారు. ఏఓలు శ్రీనాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఉమామహేశ్వరి, ప్రతాప్ పాల్గొన్నారు.

రేపు ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు పరీక్ష

గార్లదిన్నె, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు సోమవారం ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆదర్శ పాఠశాలలో 100 సీట్లకు గాను 193 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేస్తున్న విద్యార్థులకు సోమవారం ఉదయం 10 గంటలకు పరీక్ష ఉంటుందన్నారు.

రేపు రాప్తాడులో గ్రీవెన్స్

అనంతపురంరూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం మండల కేంద్రంలో స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రఘు తెలిపారు. ఉదయం 9గంటలకు గ్రీవెన్స్ ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరవుతారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తమ సమస్యలపై అర్జీల రూపంలో ఇచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

డ్రోన్ సర్వేతో తెగుళ్ల నివారణకు చర్యలు

గార్లదిన్నె, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): డ్రోన్ సర్వేతో చీనీ తోటలకు సోకిన తెగుళ్ల నివారణ సులభం అవుతుందని మైక్రో ఇరిగేషన్ అధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ముకుందాపురం గ్రామంలో చీనీ తోటలకు చేపట్టిన డ్రోన్ సర్వేను శనివారం ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్‌తో కలసి రఘునాథ్‌రెడ్డి పరిశీలించారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రీ సైక్లింగ్ చేయాలి

● జేసీ శివనారాయణశర్మ


ర్యాలీలో పాల్గొన్న జేసీ శివనారాయణశర్మ

రాప్తాడు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎలాక్ట్రానిక్ వ్యర్థాలు రీ సైక్లింగ్ చేయాలని జేసీ శివనారాయణశర్మ సూచించారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రాప్తాడులో ఎలక్ట్రానిక్ వ్యర్థాల ప్రత్యేక నిర్వహణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జేసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి వాటినిలో ప్రమాదకర భాగాలను వేరు చేసి మిగతా పరికరాలను రీసైక్లింగ్ చేయాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ సాకే తిరుపాలు, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి, ఈఓఆర్డీ ఆనంద్‌ప్రసాద్ పాల్గొన్నారు.

పనికిరాని ఎలక్ట్రానిక్ పరికరాలు అందజేత

అనంతపురం క్లాక్‌టవర్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సాధనకు డ్వామా, డీఆర్‌డీఏ-వెలుగు ఉద్యోగులు నడుం బిగించారు. శనివారం డ్వామా, డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయాల్లో పనికిరాని ఎలక్ట్రానిక్ పరికరాలను సేకరించి మెప్మా ప్రతినిధులకు అందజేశారు. పరిసర ప్రాంతాల్లో చెత్తను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఉద్యోగులతో డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు సలీంబాషా, ఈశ్వరయ్య ప్రతిజ్ఞ చేయించారు. డ్వామా అడిషినల్ పీడీ సుధాకర్ రెడ్డి, ఏపీడీ అయేషా, డీఆర్‌డీఏ పీఎం రాధారాణి పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: ఇళ్లు, కార్యాలయాలు, ఇతర వ్యాపార సంస్థల్లో పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలు శాస్త్రీయ పద్ధతుల్లో తొలగించడం ఎంతో ముఖ్యమని ఎంపీడీఓ దివాకర్ అన్నారు. శనివారం మండలంలోని గ్రామాల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, రఘునాథ్, ఓబుళలపతి, పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్ బాబు ఇళ్లలోని పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులు సేకరించారు.

అనంతపురం టౌన్: ప్రభుత్వ పిలుపు మేరకు శనివారం వైద్యశాఖలో స్వచ్ఛాంధ్ర--స్వచ్ఛదివస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లావైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టరుఈబీ దేవి తోటిడాక్టర్లు, ఉద్యోగులు ఆవరణంలో చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. వైద్యకలాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు, డాక్టర్లు, మెడికోలు కలిసి శుభ్రత కార్యక్రమం చేపట్టారు.

నార్పల: స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో మనం ముందు వరుసలో ఉండాలని సర్పంచు ఆలం శిరీష, టీడీపీ నాయకుడు ఆలం వెంకటనరసానాయుడు అన్నారు. శనివారం నార్పల మండలం బొందలవాడ గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.

అనంతపురం సెంట్రల్ : స్వచ్ఛ ఆంధ్రా - స్వర్ణ ఆంధ్రా కార్యక్రమాన్ని పురష్కరించుకుని శనివారం ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞచేయించారు. కోఆర్డినేటర్ మురళీధరరావు, ప్రిన్సిపాల్ సోమశేఖర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ సత్యసౌమ్య పాల్గొన్నారు.


ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు


పిచ్చుకగూళ్లతో గ్రీన్ ఆర్మీ నిర్వాహకులు, విద్యార్థినులు

పక్షుల రక్షణ కోసం పిచ్చుక గూళ్ల ఏర్పాటు

● సంచులు పంపిణీ చేసిన గ్రీన్ ఆర్మీ నిర్వాహకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పచ్చదనం, పక్షుల రక్షణ కోసం నగరంలోని బీసీ బాలికల వసతిగృహంలో పిచ్చుక గూళ్లను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా గ్రీన్ ఆర్మీ నిర్వాహకుడు అనిల్‌కుమార్ శనివారం వసతిగృహంలోని విద్యార్థినులకు శానిటరీ న్యాప్కిన్స్ గుడ్డతో తయారు చేసిన సంచులను అందజేశారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ... పిచ్చుకలు చిన్న చిన్న పక్షులు అంతరించిపోతున్న కారణంగా ఇప్పటి వరకూ జిల్లాలో 1.70 లక్షల పిచ్చుకగూళ్లను ఏర్పాటు చేశామన్నారు. వసతిగృహంలో ఏర్పాటు చేసిన పిచ్చుకగూళ్లను కాపాడే బాధ్యత విద్యార్థినులు తీసుకోవాలని సూచించారు. బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ, ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి, మస్తాన్, మారుతీప్రసాద్, మాధవీలత పాల్గొన్నారు.

అన్నదాతల సంబరం


ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాక్టర్‌లో తీసుకెళుతున్న రైతు

రాప్తాడు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ట్రాన్స్‌ఫార్మర్లు లేక ఇబ్బంది పడిన రైతులకు ప్రభుత్వం ట్రాన్స్‌ఫార్మర్లు అందచేయడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వంలో ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు చెల్లించి రైతులు ఏంతో కాలం ఎదురు చూశారు. పంటలు సాగు చేసి విద్యుత్ సరఫరా లేక తీవ్రంగా నష్టపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే నియోజకవర్గం వ్యాప్తంగా 250 ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ శాఖ అధికారులు రైతులకు అందచేశారు. రైతులు సంతోషంగా ట్రాన్స్‌ఫార్మర్లను ట్రాక్టర్లలో తీసుకెళుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల సరఫరాను మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పరిశీలించారు. విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవతో రైతుల విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. లో ఓల్టేజ్ సమస్య పరిష్కరించేందుకు 4 సబ్ స్టేషన్లు కూడా నిర్మిస్తున్నారన్నారు.

పంచాయతీలో ఈ-వేస్ట్ సేకరణ కేంద్రాలు


మొక్క నాటి నీరుపోస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పదివేలు జనాభా ఉన్న పంచాయతీల్లో ఈ వేస్ట్ సేకరణ కేంద్రాలను ప్రారంబిస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని సంపద సృష్టి కేంద్రాలను పరిశీలించారు. అంగన్ వాడీ కేంద్రాలు సందర్శించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరగిందన్నారు. ఏవైనా పాడైతే పారవేస్తున్నారన్నారు. అలాకాకుండా ఆ వస్తువులను సేకరించి వాటిలో విలువైన వాటిని సేకరించి మళ్లీ ఉపయోగించేలా ఈ వేస్ట్ సేకరణ కార్యక్రమాన్ని తీసుకువచ్చామన్నారు. జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు, తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ వెంకటనాయుడు, కార్యదర్శి అశోక్‌బాబు పాల్గొన్నారు.

ప్రభాకర్‌జీ పాఠశాలలో ఘనంగా వార్షిక సంబరాలు


ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో విద్యార్థులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పాతూరులోని ప్రభాకర్‌జీ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో శనివారం పాఠశాల వార్షికోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తరగతికి ఒకరు చొప్పున ఒకొకరికి రూ.1116 నగదు బహుమతి, మెమెంటో, ప్రశంసా పత్రం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ కళాపీఠం సంస్థ డైరెక్టర్ శంకర్‌రెడ్డి, కత్తి విజయ్‌కుమార్, రషీద్‌బాషా పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మంచి భవిష్యత్తు


విద్యార్థులతో కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి

అనంతపురం విద్య, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే క్రమశిక్షణ అలవాటైతే ఉజ్వల భవిష్యత్తు సొంతం అవుతుందని కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం అశోక్‌నగర్‌లోని మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఎలిమెంటరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కరస్పాండెంట్ చేతుల మీదుగా విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

ఈ- వేస్ట్ చాలా ప్రమాదకరం: కాలవ



ఎలక్ట్రానిక్ వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేస్తున్న కాలవ

రాయదుర్గం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): హాని కారకాలు ఉండే ఈ - వేస్ట్‌తో చాలా ప్రమాదం పొంచి ఉందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన అవగాహన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా కాలవ పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఇళ్లల్లో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను మున్సిపల్ చెత్తబుట్టల్లో వేయాలని కోరారు. ముఖ్యంగా క్యాన్సర్ కారకాలు ఉండే హానికరమైన చెత్తను ఉంచుకోకూడదన్నారు. తడిచెత్త, పొడిచెత్తతో పాటు ఇపుడు ప్రమాదకరచెత్తను కూడా వేరువేరుగా చేయాలన్నారు. దీని కోసం ఈ - వేస్ట్ నిర్వహణ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వ్యర్థాల నుంచి సంపదను సృష్టించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అమెరికా లాంటి దేశాల్లో వ్యర్థాల నుంచి పెట్రోల్‌ను తయారు చేస్తున్న విషయాలను వివరించారు. అనంతరం కార్యాలయంలోని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేశారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ అంతకు ముందు ఉదయాన్నే పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర ర్యాలీలో కాలవ పాల్గొన్నారు.

2047 నాటికి అగ్రగామిగా రాష్ట్రం

రాయదుర్గం: ముఖ్యమంత్రి చంద్రబాబు 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు బలమైన పునాదులు వేస్తున్నారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కొనియాడారు. చంద్రబాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంకా 15 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉంటారని తెలిపారు. 75 ఏళ్ల వయస్సులో కూడా పాతికేళ్ల వయసున్న యువకులు చేయలేని కష్టాన్ని చేసి రాష్ట్ర సర్వోతోముఖాభివృద్ధికి పాటు పడుతున్నారని తెలిపారు. ఆయన నాయకత్వంలో పనిచేస్తున్నందుకు గర్వపడుతున్నామని అన్నారు. ఆదివారం 75వ పుట్టినరోజు జరుపుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



ఈజీమార్ట్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పుట్లూరు, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం ఆమె ఈజీమార్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కిరాణాషాపులు నిర్వహించాలనుకున్న మహిళా సంఘాల సభ్యులకు ఈ పథకం తోడ్పడుతుందన్నారు. ముందుగా ఈజీమార్ట్ ఒప్పందం మేరకు పాత కిరాణా షాపుదారులు మొదటి విడతగా రూ.30వేలు, కొత్త కిరాణాషాపుదారులు మొదటి విడతగా రూ.50వేలు చెల్లించి ఈజీమార్ట్‌లో పేరు నమోదు చేసుకోవచ్చునన్నారు. నమోదుకు చెల్లించిన మొత్తానికి సరిపడా సరుకులను ఈజీమార్ట్ అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈజీమార్ట్ ద్వారా మహిళల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని తెలిపారు. అనంతరం మార్ట్‌కు సంబంధించిన లోగోలను ఆమె ఆవిష్కరించారు. టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కాలనీల్లో ఎమ్మెల్యే అశ్మిత్ పర్యటన

తాడిపత్రి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మెయిన్‌బజార్, నవరంగ్‌టాకీస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మెయిన్‌బజారులో ఉన్న ఓ వృద్ధురాలితో మాట్లాడుతూ అవ్వా నీకు పింఛన్ వస్తోందా అని ప్రశ్నించారు. మీ చొరవ వల్ల వస్తోంది నాయనా అంటూ వృద్ధురాలు సంతోషం వ్యక్తం చేశారు. ఎవరైనా అర్హులు ఉన్నవారు పింఛన్‌లు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని ఆయా కాలనీల వాసులకు తెలిపారు. అలాగే సమస్యలున్నా తెలపాలని, అధికారులు వెంటనే పరిష్కరిస్తారని ఆయన వారితో పేర్కొన్నారు. పలువురు అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులతో వ్యవసాయ అధికారుల సమావేశం

విడపనకల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాలపల్లి గ్రామంలో వ్యవసాయ అధికారులు శనివారం పర్యటించారు. అక్కడి రచ్చ కట్ట వద్ద రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. వచ్చే ఖరీఫ్‌లో సాగు చేసే పంటల్ని జింకల బెడద నుంచి కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ చర్యలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర, ఇతర అధికారులు గ్రామ రైతులు పాల్గొన్నారు.

గుత్తిలో రన్‌ఫర్ జీసస్

గుత్తి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీఎస్ఐ టౌన్ చర్చి ఆధ్వర్యంలో శనివారం రన్‌ఫర్ జీసస్‌ను నిర్వహించారు. ఆర్ఎస్‌లోని కర్నూలు రోడ్డులో ఉన్న సీఎస్ఐ చర్చివద్ద నుంచి ప్రారంభమైన కార్యక్రమం మెయిన్ బజార్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీ సర్కిల్ వరకు కొనసాగింది. రెవరెండ్‌లు సల్మాన్‌బాబు, డెవిడ్‌నాయక్, పాస్టర్ కన్నయ్య, గాబ్రియేల్ ప్రసాద్, పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణ పురం గ్రామానికి చెందిన హనుమంతరాయుడు, జయమ్మ దంపతుల కుమారుడు ఆదికుమార్ ఇటీవల బెంగళూరులో రోడ్డు ప్రమాదానికి గురై వెన్నెముక దెబ్బతింది. చికిత్స చేయించడానికి ఆర్థిక స్థితి లేక తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న పట్టణంలోని ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ శనివారం బాధితుడి ఇంటికి అతడి తల్లిదండ్రులకు వెళ్లి రూ. 18 వేలు ఆర్థిక సాయం చేశారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చండి

గుంతకల్లుటౌన్,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను వాల్మీకి సేవాదళ్ పార్లమెంట్ అధ్యక్షుడు బుల్లెట్ లింగమయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ఒప్పించాలని కోరారు. పలువురు వాల్మీకి సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

ఘనంగా ఉట్లమానోత్సవం

కంబదూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద శనివారం ఉట్లమాను ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్లమాను ఎక్కేందుకు యువత పోటీ పడ్డారు. మల్లేశ్వరస్వామి జాతర తర్వాత మరుసటి రోజు ఈ ఉట్లమాను ఉత్సవాన్ని జరుపుతారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల దాకా సాగిన ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి స్థానికులే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు సైతం పెద్దఎత్తున తరలివచ్చారు.



ఉట్లమానోత్సవంలో పాల్గొన్న జనం



తాడిపత్రి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి



బొమ్మనహాళ్‌లో అధికారుల ప్రతిజ్ఞ



గుత్తిలో మున్సిపల్ సిబ్బంది ర్యాలీ



శెట్టూరులో అధికారులు, విద్యార్థుల మానవహారం

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో ప్రజాప్రతినిధులు, అధికారుల సూచన

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: పరిశుభ్రతతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని, కనుక ప్రతిఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని అన్ని పట్టణాలు, మండలకేంద్రాలతో పాటు గ్రామాల్లో సైతం శనివారం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలు పార్టీల నాయకులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ర్యాలీలు చేపట్టి పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇళ్లల్లోంచి వచ్చే చెత్తను వ్యర్థాలను, పనిరానికి ఎలక్ట్రానిక్ వస్తువులను ప్రజలు ఎక్కడబడితే అక్కడ వేయకుండా చెత్త సేకరణకు వచ్చే గ్రామపంచాయతీ, మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని చెప్పారు. సిబ్బంది వాటిని రీసైక్లింగ్ చేయుటకు పంపిస్తారని పేర్కొన్నారు. తాడిపత్రిపట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పా టించాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.



ఉరవకొండ డిగ్రీ కళాశాలలో
ఈ వ్యర్థాలపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జయనగర్‌కాలనీకి చెందిన నరసింహ (22) అనే యువకుడు ఉద్యోగం రాలేదని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. జయనగర్‌కాలనీకి చెందిన కరుణాకర్, ఇందిర దంపతులకు ఇద్దరు కుమారులు. కరుణాకర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెద్దకుమారుడు నరసింహ బీటెక్ పూర్తిచేశాడు. ఏడాది నుంచి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెంది ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



నరసింహ (ఫైల్)

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

రాయదుర్గం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపసముద్రానికి చెందిన ఈరక్క(80) 74ఉడేగోళం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృ తి చెందింది. భూపసముద్రం గ్రామానికి చెందిన ఈరక్కకు మతిస్థిమితం లేదు. ఆ గ్రామం నుంచి దగ్గర్లో ఉన్న ఉడేగోళంకు శనివారం ఉదయం నడుచుకుంటూ వెళ్లిన ఆమె ప్రధాన రహదారి దాటేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఆమెను ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని , దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే గుమ్మనూరు



రైతులకు పనిముట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

గుత్తి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో శనివారం రైతులకు వ్యవసాయ యాంత్రాల పంపిణీ చేపట్టారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. చంద్రబాబు సీఎం అవగానే రైతుల అభ్యున్నతికి పాటుపడుతున్నారని తెలిపారు. అందులో భాగంగానే సబ్సిడీతో వ్యవసాయ యంత్రాలను అందజేస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెలలో అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ.20వేలు అందించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే కేబినేట్‌లో నిర్ణయం తీసుకున్నారని అన్నారు. అనంతరం రైతులకు 50శాతం సబ్సిడీతో వ్యవసాయ యంత్రాలను అందజేశారు. గుత్తి మండల రైతులకు రూ.10.75లక్షల విలువైన పలు యంత్రాలను అందజేశారు. ఇక పామిడి మండల రైతులు 30మందికి రూ.7.66లక్షల విలువ చేసే యంత్రాలను పంపిణీ చేశారు. అలాగే ఆ రెండు మండలాలకు రెండు డ్రోన్‌లు మంజూరయ్యాయని, వీటి విలువ రూ.10లక్షలు ఉండగా రూ. 8లక్షల సబ్సిడీ పోను మిగతా రూ.2లక్షలు రైతు వాటా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, టీడీపీ పట్టణ, మండల కన్వీనర్లు ఎంకే చౌదరి, బద్రివలి, న్యాయవాది సోమశేఖర్, ఏడీఏ వెంకటరాముడు, ఏఓలు ముస్తాక్ అహ్మద్, వసుంధర, ఏఈఓ కృష్ణభగవాన్, శ్రీపురం సర్పంచు లింగమయ్య, ఎంపీటీసీ ధనుంజయ, పామిడి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌చౌదరి, టీడీపీ నాయకులు చికెన్ శ్రీనివాసులు, ప్రతాప్, రమేష్, దిల్కాశీనా తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలి

● ముస్లింలు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల డిమాండ్ ● పెద్దఎత్తున నిరసన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కు తీసుకోవాలని గుంతకల్లు ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శనివారం వారు నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఈద్గా మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ ధర్మవరంగేట్ రోడ్డు, మండిబజారు, పాతబస్టాండ్ మీదుగా పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకు సాగింది. ఇందులో వక్ఫ్ బిల్లును తక్షణమే ఉపసంహరించాలని కోరుతూ నల్లజెండాలు, జాతీయ జెండా చేతపట్టి నినాదాలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు డీ.జగదీష్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంభూల్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దౌల్తాపురం ప్రభాకర్, వైసీపీమైనార్టీ నాయకుడు నదీమ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు స్వామిదాస్ తదితరులు మాట్లాడారు. దేశంలో ముస్లిం ఆస్తులను కార్పొరేట్ చేతుల్లో పెట్టేందుకే ప్రధాని మోదీ ఈ వక్ఫ్ సవరణ బిల్లును తీసుకొచ్చారని విమర్శించారు. బీజేపీ చేస్తున్న మతతత్వ రాజకీయాలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకునే వరకుపోరాటం ఆపేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ రజాక్ పీర్, అదనపు ఖాజీ సత్తార్‌సాబ్, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్లు షైమూన్, నైరుతిరెడ్డి, కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

కొళాయి తొలగించారని ధర్నా

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో తాగునీటి కోసం గతమార్చిలో ఎమ్మార్పీఎస్ నాయకుడు ఓబుళేసు స్థానిక ప్రజలతో కలిసి పబ్లిక్ నీటి కొళాయి ఏర్పాటు చేసుకున్నారు. అయితే రెండు రోజులకే అనుమతి లేదంటూ మున్సిపల్ సిబ్బంది దానిని తొలగించారు. పబ్లిక్ కొళాయి తొలగించడాన్ని నిరసిస్తూ సీపీఐ, ఎమ్మార్పీఎస్ నాయకులు స్థానిక ప్రజలతో కలిసి స్థానిక సచివాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. తాగునీటి కోసం కొళాయి ఏర్పాటు చేసుకోవడం పాపమా అంటూ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ అధికారులను ప్రశ్నించారు. కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

శ్రీరామిరెడ్డి కార్మికుల సమస్యలను తీర్చండి

కణేకల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి కార్మికుల సమస్యలను తీర్చి గ్రామాలలో తాగునీటి సరఫరాకు ఇబ్బంది రాకుండా చూడాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు జయచంద్రారెడ్డి కోరారు. 15 రోజులకొకసారి శ్రీరామిరెడ్డి కార్మికులు జీతాలతో పాటు ఇతరత్రా డిమాండ్ల కోసం ఆందోళన చేస్తుండడంతో అనేక గ్రామాలకు తాగునీరు సరఫరా నిలిచిపోతోందన్నారు. దీంతో అనేక గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు సొల్లాపురం గ్రామంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్థంభ ప్రతిష్ఠ ఉండగా వేలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. కావున కలెక్టర్‌తో పాటు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి శ్రీరామిరెడ్డి కార్మికులను సమస్యలను తీర్చి ఈ వేసవిలో ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడకుండా చూడాలని ఆయన కోరారు.

రెస్క్యూ ఆపరేషన్ సక్సెస్

● ప్రాణాపాయం నుంచి బయటపడిన గాలిమరల టెక్నీషియన్



చికిత్స పొందుతున్న టెక్నీషియన్

ఉరవకొండ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నింబగల్లు సమీపంలో గాలి మరకు మరమ్మతు చేస్తూ పట్టుతప్పి కిందకు జారిన టెక్నీషియన్ తాడు కాళ్లకు తగులుకుని గాలిలో వేలాడుతుండగా.. రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి క్షేమంగా కిందకు దించారు. గాలిమరలకు సంబంధించిన సీమన్స్ కంపెనీకి చెందిన టెక్నీషియన్ సుందరేష్ మెయింటెన్స్‌లో భాగంగా గత శుక్రవారం నింబగల్లు సమీపంలో ఓ గాలి మరకు మరమ్మతు చేస్తూ పట్టుతప్పి ఒక్కసారిగా కిందకు జారాడు. ఆ క్రమంలో 100అడుగుల తాడు కాళ్లకు తగులుకోవడంతో అతను కింద పడ కుండా మధ్యలో వేళాడుతూ కేకలు వేశాడు. విషయాన్ని గుర్తించిన గాలిమరల సిబ్బంది అగ్నిమాపక అధికారులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక అధికారులు, సిబ్బంది గాలిమరపైకి మరొక ఐరన్ రోప్ సహాయంతో వెళ్లి, తాడుకు వేలాడుతున్న సుందరేష్ వద్దకు చేరుకున్నారు. అతనిని ఐరన్ రోప్‌కు అటాచ్ చేసుకుని నెమ్మదిగా కిందకు వచ్చారు. రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి అతనిని క్షేమంగా కాపాడారు. కాళ్లకు స్వల్ప గాయాలవడంతో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని వైసీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై రాజశేఖర్‌రెడ్డి కోరారు. మండలంలోని పాతకొత్తచెరువు గ్రామంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారమివ్వాలన్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే వైసీపీ ఆధ్వర్యంలో రైతుల పక్షా న ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

నేడు సీఎం జన్మదిన వేడుకలు

పుట్లూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను ఆదివారం మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ బాలరంగయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైద్యశిబిరం నిర్వహించడంతో పాటు బ్రెడ్లు పంపిణీ, అన్నదానం చేపట్టనున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరవుతున్నట్లు తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

శిక్షణ తరగతుల కరపత్రాల విడుదల

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 26, 27, 28 వ తేదీల్లో కడప జిల్లాలో జరిగే విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

భూముల పరిశీలన

పుట్లూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటికుంట్లలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆక్రమించిన భూములను రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శేషారెడ్డి, సీఐ సత్యబాబు, సర్వేయర్ శాంతి అక్కడి హద్దుల రాళ్లను పరిశీలించారు. పెద్దారెడ్డి భూముల వ్యవహారంపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వంటావార్పు ప్రకటన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు స్పందించి సర్వే ప్రారంభించారు. అనంతరం తోటలో గేటు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. సర్వే పూర్తయిన వెంటనే నివేదిక ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ఎస్సీకార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలు అందించి స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు మండలంలోని నిరుద్యోగ యువత మే 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నందకిషోర్ శనివారం ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, కుల ధ్రువీకరణ పత్రం తీసుకెళ్లి గ్రామ సచివాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉరవకొండ/కణేకల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ సబ్‌డివిజన్ పరిధిలో కణేకల్లు, విడపనకల్లు, ఉరవకొండ మండలాల్లో 21, 22వ తేదీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ భాస్కర్ శనివారం ప్రకటనలో తెలిపారు. వజ్రకరూరు మండలంలో 132 కేవీ టవర్ నిర్మాణం పనులు జరుగుతున్నాయని, అందులో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొనకొండ్ల రోడ్డులో గల శ్రీ వివేకానందా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలో శనివారం ఫేర్‌వెల్ డేను ఘనంగా నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల వ్యవస్థాపకుడు మంజునాథ్, కరెస్పాండెంట్ ఓంకారప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అనంతపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పామిడి పట్టణంలోని వీకే ఆదినారాయణరెడ్డి కాలనీకి చెందిన చాకలి లక్ష్మన్న(62) విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. లక్ష్మన్న రజక వృత్తి నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. కాగా శనివారం రాత్రి ఇంటి వద్ద దుస్తులను కరెంటు పెట్టెతో ఇస్త్రీ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురైకుప్పకూలాడు. కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎంపీకి వినతి



ఎంపీకి వినతిపత్రం
అందజేస్తున్న టీడీపీ నాయకులు

తాడిపత్రి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరికరాల కోసం ఎంపీ నిధుల నుంచి నిధులు మంజూరు చేయాలని ఎంపీ అంబికా లక్ష్మినారాయణకు టీడీపీ నాయకులు అరవింద నారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి విన్నవించారు. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్‌చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం వారు అనంతపురంలో ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పరికరాలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాటి కోసం నిధులుమంజూరు చేయాలని కోరారు. ఇందుకు ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి టీడీపీ నాయకుడి విరాళం



ఆలయ నిర్వాహకులకు నగదును
అందజేస్తున్న టీడీపీ నాయకుడు

యల్లనూరు, ఏప్రిల్, 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎస్సీకాలనీలో చేపడుతున్న పెద్దమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి టీడీపీ మండల నాయకుడు అనిల్‌కుమార్‌చౌదరి రూ.17వేలు విరాళం అందజేశారు. ఆ నగదును శనివారం ఆలయ నిర్వాహకులకు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచనల మేరకు ఈ మొత్తాన్ని అందించినట్లు తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ రామాంజనేయులు, యల్లనూరు ఆయకట్టు సంఘం అధ్యక్షుడు ఆదిశేషులనాయుడు, జంగంపల్లి సర్పంచు కుళ్లాయప్పనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు



పుష్పాలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయాన్నే ఆలయంలోని స్వామివారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, పలు రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించి మహామంగళహారతి ఇచ్చారు. దర్శనానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

యూనియన్‌బ్యాంకు వద్ద రైతుల ధర్నా

శెట్టూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలేడు యూనియన్ బ్యాంకు వద్ద అనుంపల్లి, తిప్పనపల్లి, పెరుగుపాలెం, చింతర్లపల్లి గ్రామాల రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. బ్యాంకు ఎదుట రోడ్డుపై బైఠాయించి బ్యాంకు అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పంటరుణాల రెన్యూవల్‌కు వడ్డీ మాత్రమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకు మేనేజరు జగదీష్ సానూకూలంగా స్పందించడంతో రైతులు ధర్నా విరమించారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

యాడికి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కుటుంబ సాధికారిక సారథులు నిర్విరామంగా కృషిచేయాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పరిమి సోమశేఖర్‌నాయుడు తెలిపారు. మండలకేంద్రంలో శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పరిమి సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ బలోపేతం కోసం ప్రతి 60 మంది ఓటర్లకు కుటుంబ సాధికారిక సారధిలను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కుటుంబ సాధికారిక సారథులు తమ పరిధిలోని 60మంది ఓటర్లకు నిరంతరం అందుబాటులో ఉండి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు, అభివృద్ధి పనులను వివరించాలని తెలిపారు. సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, బీసీ సెల్ మండల కన్వీనర్ తిరంపురం నీలకంఠ, పట్టణ అధ్యక్షుడు ఆదినారాయణ, నాయకులు రాజశేఖర్‌నాయుడు, తాంద్రవిక్రమ్, నరసింహచౌదరి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.